నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644
సంచిక : 231 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 06-12-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00

**నీలగిరి నిత్యపద్యం**
ఆటవెలది

వాదులాట పెరుగు వాదించుకొన్నచో
చర్చచేసుకొనిన సద్గుమణుగు
కలిసియున్నతోడ కలుగుసుఖమెపుడు
విజయలక్ష్మి వాక్కు వినుర నరుడ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

**విలేకరులు కావలెను**
తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



# భారత్,రష్యాల శాంతిమార్గం

## భారత్ ఎల్లప్పుడు శాంతిపక్షమే

- దైత్యంతోనే రష్యా ఉక్రెయిన్‌లు విభేదాల పరిష్కారం
- పుతిన్‌తో భేటీలో ప్రధాని మోడీ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శాంతిపక్షానే భారత్ నిలుస్తుందని, ఉక్రెయిన్ సంక్షోభాన్ని శాంతియుతంగా, చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు సహకరిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో రష్యా అధ్యక్షుడు పుతిన్ తో శుక్రవారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ప్రధాని పాల్గొన్నారు. అనంతరం ప్రధాని మాట్లాడుతూ, దేశాల సంక్షేమం శాంతి మార్గంలోనే ఉందని, దౌత్యం ద్వారానే రష్యా, ఉక్రెయిన్‌లు విభేదాలను పరిష్కరించుకుంటారనే నమ్మకం -మిగతా 2 లో

## ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మా లక్ష్యం

- అర్బన్ ఏరియాల్లో కూడా బహుళ అంతస్థుల నివాసాలు
- హిల్ట్ పాలసీపై కేటీఆర్‌వి అర్థం లేని విమర్శలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తమ ప్రభుత్వం వచ్చాక పేదలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల అంశంపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు కేటాయించే బాధ్యత తీసుకున్నట్లు పేర్కొన్నారు. వచ్చే మూడేళ్లలో అర్బన్ ప్రాంతాల్లోనూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం. ఇక్కడ జీ ప్లస్ త్రీ, జీ ప్లస్ ఫోర్ విధానంలో నిర్మిస్తాం. మధ్యతరగతి వర్గాలకూ మంజూరయ్యేలా చర్యలు చేపట్టాం. -మిగతా 2 లో

## బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధిని
# గాలికొదిలేశారు

### వరివేస్తే ఉరి అని రైతులను బెదరించారు




- ఫామ్‌హౌజ్‌లు కట్టుకుని వేలకోట్లు వెనకేసుకున్నారు
- సన్నవడ్లకు 500 బోనస్ ఇస్తున్నాం
- రుణమాఫీ చేసి రైతులను ఆదుకున్నాం
- రాష్ట్రంలో కోటి 10 లక్షల రేషన్ కార్డులు ఇచ్చాం
- 3 కోట్ల 10 లక్షల మందికి సన్న బియ్యం ఇస్తున్నాం
- ఉచిత విద్యుత్‌కు పేటెంట్ కాంగ్రెస్ మాత్రమే
- హైదరాబాద్ తరహాలో వరంగల్ అభివృద్ధి చేస్తున్నాం
- ప్రజాపాలన విజయోత్సవ సభలో సీఎం రేవంత్ రెడ్డి
- నర్సంపేటలో రూ.532 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**వరంగల్,- డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉండగా గత పదేళ్లలో భారీగా ఆస్తులు సంపాదించారు.. కానీ ఈ ప్రాంతం అభివృద్ధిని గాలికి వదిలేశారని సిఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ ఆనాడు వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్లేనని అన్నారు.. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం.. వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తూ.. వరికి ప్రోత్సాహకాలిచ్చామని తెలిపారు. సన్న వడ్డుల పండిస్తే 500 బోనస్ ఇస్తున్నామని అన్నారు. ఉచిత విద్యుత్ పేటెంట్ మా పార్టీదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గత పాలకులు ఫాంహౌస్ లు కట్టుకున్నారు, విమానాలు కొన్నారు.. ఉద్యమగడ్డ వరంగల్ కు మాత్రం ఏమీ ఇవ్వలేదని ఘాటు విమర్శలు చేశారు. -మిగతా 2 లో



## దేవాలయాల డబ్బు ఇతరత్రా
# పనులకు వినియోగించరాదు

- డిపాజిట్లను వెంటనే వాపస్ చేయాలన్న సుప్రీం
- కేరళ ఆలయ కేసులో ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ -**
:ఆలయాలకు చెందిన డబ్బును ఇతరత్రా పనులకు వినియోగించరాదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కో-ఆపరేటివ్ బ్యాంకులను రక్షించేందుకు ఉపయోగించొద్దంటూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కేరళలో ఓ ఆలయానికి చెందిన సొమ్మును వాపస్ చేయడంలో కో ఆపరేటివ్ బ్యాంకులు తాత్సారం చేయడంపై సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ సొమ్ము పూర్తిగా దేవుడికి చెందినదని తేల్చి చెప్పింది. ఆ నిధులను ఆలయ ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ వ్యాఖ్యలు చేసింది. సహకార బ్యాంకులకు ఆదాయ వనరుగా లేదా అవి మనుగడ సాగించేందుకు ఆలయ నిధులు ఉపయోగించొద్దని సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. కేరళలోని తిరునెల్లి దేవస్థానం చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్లను తిరిగి చెల్లించాలని కేరళ హైకోర్టు గతంలో ఆదేశించింది. దీనిని సవాలు చేస్తూ మనాంతవాడి కో-ఆపరేటివ్ అర్బన్ సొసైటీ లిమిటెడ్, తిరునెల్లి సర్వీస్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ సహా కొన్ని సహకార బ్యాంకులు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్‌ను -మిగతా 2 లో

## పాక్ రక్షణ దళాల అధిపతిగా మునీర్ నియామకం

- ఫీల్డ్ మార్షల్ సయ్యద్ అసిమ్ మునీర్ మరింత శక్తివంతంగా తయారు
- రక్షణ దళాలకు తొలి చీఫ్‌గా ఆయన్ను నియమిస్తూ పాకిస్థాన్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారి ఆదేశాలు జారీ
- మిలిటరీ కమాండ్‌ను కేంద్రీకృతం చేసేందుకు పాక్ సర్కారు ఈ నిర్ణయం




**ఇస్లామాబాద్ - డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఫీల్డ్ మార్షల్ సయ్యద్ అసిమ్ మునీర్ మరింత శక్తివంతంగా తయారయ్యారు. రక్షణ దళాలకు తొలి చీఫ్‌గా ఆయన్ను నియమిస్తూ పాకిస్థాన్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారి ఆదేశాలు జారీ చేశారు. అయిదేళ్ల పాటు అసిమ్ మునీర్ .. సీడీఎఫ్(చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్)గా కొనసాగనున్నారు. చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ పదవి కోసం మునీర్ పేరును పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రతిపాదించారు. అయితే ఆ ప్రతిపాదనకు ఆమోదం దక్కినట్లు పాక్ అధ్యక్ష కార్యాలయం తన ఎక్స్ -మిగతా 2 లో

## సాయి ఈశ్వర్ మరణానాకి
# ప్రభుత్వానిదే బాధ్యత

- బిసి రిజర్వేషన్లతో మోసం వల్లే అతను ఆత్మహత్య
- అతని కుటుంబానికి 50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ రావులు డిమాండ్



**హైదరాబాద్, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సాయిఈశ్వర్ మరణానాకి ప్రభుత్వానిదే బాధ్యతని బిఆర్ఎస్ ఆరోపించింది. బిసి రిజర్వేషన్ల పేరుతో మోసం చేయడం వల్లనే అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడని విమర్శించింది. బీసీ రిజర్వేషన్ల పేరిట సీఎం రేవంత్ రెడ్డి చేసిన దారుణమైన మోసానికి సాయి ఈశ్వర్ అనే యువకుడి నిండు ప్రాణం బలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీకి కాంగ్రెస్ సర్కారు తూట్లు పొడవడాన్ని తట్టుకోలేకే ఈశ్వర్ ఆత్మాహుతి చేసుకున్నాడని తెలిపారు.
-మిగతా 2 లో



## వెనుకబడిన పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ


- షైనింగ్ స్టార్స్ కార్యక్రమం ప్రవేశపెట్టాం
- జగన్ హయాంలో విద్యా వ్యవస్థను అస్థవ్యస్తం
- లోకేశ్ ఏరికోరి విద్యాశాఖ తీసుకున్నాడు
- బామిని పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో చంద్రబాబు

**పార్వతీపురం-**
చదువులో వెనుకబడిన పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడానికి షైనింగ్ స్టార్స్ కార్యక్రమం ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. జగన్ హయాంలో విద్యా వ్యవస్థను అస్థవ్యస్తం చేశారని.. ఆ పరిస్థితిని తమ ప్రభుత్వంలో చక్కదిద్దామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో స్పష్టమైన విధానంతో ముందుకెళ్తున్నామని వివరించారు.స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చదివారని.. రాష్ట్రంలోని విద్యార్థులను కూడా అదే స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. లోకేశ్ కోసం తాను ఎప్పుడూ స్కూలుకు వెళ్లలేదని చెప్పుకొచ్చారు. ఏపీ విద్యశాఖలో నూతన ఒరవడి సృష్టిస్తానని లోకేశ్ అన్నారని.. ఈ విషయంలో తాను ఆశీర్వదించానని పేర్కొన్నారు. ఏపీ వ్యాప్తంగా పేరెంట్ టీచర్స్ మీటింగ్స్‌ను శుక్రవారం నిర్వహించారు. మన్యం జిల్లా బామినిలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు -మిగతా 2 లో

## ఉగ్రవాదంపై పోరులో
# భారత్‌తో కలసి నడుస్తాం

### భారత్‌తో బంధం మరింత బలోపేతం

- భారత్-రష్యా మధ్య 64 బిలియన్ డాలర్ల వ్యాపారం
- ఇరుదేశాల మధ్య మరింత వాణిజ్య సహకారం
- అమెరికా ఆంక్షలు ఉన్నా చమురు రవాణా ఆగదు
- సొంత కరెన్సీలతో వ్యాపారానికి చేరువగా ఉన్నాం
- అణువిద్యుత్ తదితర రంగాల్లో సహకారం కొనసాగిస్తాం
- ఉక్రెయిన్‌తో యుద్ధంపై మోడీ సూచనలు స్వాగతిస్తున్నాం
- మోడీతో భేటీలో సంయుక్త మీడియా సమావేశంలో పుతిన్



**న్యూఢిల్లీ, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: టెర్రరిజానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో భారత్‌తో కలిసి నడుస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. టెర్రరిజాన్ని పూర్తిగా నాశనం చేసేందుకు భారత్‌కు అండగా ఉంటామని స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ, పుతిన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ.. 'మోదీతో నిర్మాణాత్మక చర్చలు జరిగాయి. భారత్ ఆతిథ్యం ఎంతో సంతోషాన్నిచ్చింది. అనేక అంశాల్లో ఇరుదేశాల మధ్య అవగాహన కుదిరింది. విభిన్న అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నాం. -మిగతా 2 లో

## కేసీఆర్‌తో ఏకగ్రీవ సర్పంచ్‌ల భేటీ

### మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే అని వ్యాఖ్య



**గజ్వేల్,- డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల జోష్ ఊపందుకుంది. తొలి విడత పోలింగ్ ఈ నెల 11న జరుగనున్నది. అయితే పలు గ్రామాల్లోని ప్రజలు తమ గ్రామం అభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నారు. ఈ క్రమంలో ఎర్రవల్లి, నర్సన్నపేట గ్రామ పంచాయతీలకు సర్పంచ్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఏకగ్రీవంగా -మిగతా 2 లో

# భారత్,రష్యాల శాంతిమార్గం

మొదటి తరువాయి

తనకు ఉందని చెప్పారు. భారత్, రష్యా కలిసి ప్రపంచాన్ని శాంతి మార్గంలో నడిపిద్దామని పుతిన్‌తో అన్నారు. ఉక్రెయిన్ సంక్షోభం మొదలైనప్పటి నుంచి పుతిన్ ప్రభుత్వం భారత్‌పై విశ్వాసం ఉంచి ప్రతి విషయాన్ని తమతో పంచుకుందని మోదీ అన్నారు. ఇరుదేశాల మధ్య నమ్మకం అనేది గొప్ప బలమని, ఇదే విషయాన్ని తాము పదేపదే చెబుతూ వచ్చామని, ప్రపంచానికి కూడా తెలియజేశామని అన్నారు. ఇటీవల కాలంలో గ్లోబల్ నేతలతో తాను ఎప్పుడు మాట్లాడినా ఇండియా తటస్థం కాదనీ, ఇండియాకు స్పష్టమైన వైఖరి ఉందని, శాంతియుతంగా జరిగే ఏ పరిష్కారానికైనా తమ మద్దతు ఉంటుందని చాలా స్పష్టంగా చెప్పామని మోదీ తెలిపారు. భారత్-రష్యా మధ్య భాగస్వామ్యానికి ఇంధన భద్రత అనేది బలమైన స్తంభం వంటిందని, పరస్పర లాభదాయక సహకారాన్ని తాము కొనసాగిస్తామని మోదీ చెప్పారు. సివిల్ న్యూక్లియర్ ఎనర్జీలో తమ భాగస్వామ్యం దశాబ్దాల నాటిదని, క్రిటికల్ మినిరల్స్ అంశంలోనూ పరస్పర సహకారం తప్పనిసరని అన్నారు. ఆర్థిక సహకారం పెంపునకు విజన్ 2023 డాక్యుమెంట్‌పై ఉభయదేశాలు సంతకం చేసినట్టు చెప్పారు. ఇండియా-రష్యా బిజినెస్ ఫోరంలోనూ ఈరోజు తామిరువురూ పాల్గొంటామని, ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలను పటిష్టం చేసేందుకు ఇది వేదిక అవుతుందని తాము బలంగా నమ్ముతున్నామని చెప్పారు. కాగా, ఉక్రెయిన్‌తో శాంతియుత పరిష్కారానికి తాము పని చేస్తున్నట్టు పుతిన్ కూడా ప్రధాని మోదీకి తెలిపారు. కాగా, దీనికి ముందు పుతిన్‌కు రాష్ట్రపతి భవన్‌లో ఘన స్వాగతం పలికారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. తన పర్యటనలో భాగంగా రాజ్‌ఘాట్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి పుతిన్ నివాళులర్పించారు. మోడ్రన్ ఇండియా వ్యవస్థాపకుల్లో ఒకరిగా, గొప్ప ఫిలాసఫర్‌గా, మానవతావాదిగా మహాత్మాగాంధీ నిలిచారని, ప్రపంచ శాంతికి ఎనలేని కృషి చేశారని పుతిన్ అక్కడి విజిటర్స్ బుక్‌లో రాశారు. స్వేచ్ఛ, మంచితనం, మానవత్వంపై మహాత్మాగాంధీ ఆలోచన నేటికీ నిత్య నూతనమని గుర్తుచేసుకున్నారు.

# ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మా లక్ష్యం

మొదటి తరువాయి

ప్రస్తుతం 3.82 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతోందని పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో మూడు లక్షల ఇందిరమ్మ ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. త్వరలో లక్ష ఇళ్లు గృహప్రవేశానికి సిద్ధం అవుతాయని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మూడు లక్షల ఇళ్లకు గృహప్రవేశం పూర్తి అవుతుందని వివరించారు. వచ్చే ఏప్రిల్ నాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం అవుతుందని చెప్పుకొచ్చారు. కోర్ అర్బన్ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం కూడా ప్రణాళిక సిద్ధమైందని వెల్లడించారు. గ్రౌండ్ ప్లస్ ఫోర్ బిల్డింగ్ నిర్మించి పేదలకు ఇచ్చే ప్రణాళికలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. త్వరలో అర్బన్ ప్రణాళిక ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఓ ఆర్ ఆర్‌కు ఆనుకుని నలువైపులా ఉన్న స్థలాల్లో ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. ఒక్కో చోట 10వేల ఇళ్లు నిర్మించి నో ప్రాఫిట్, నో లాస్ కింద మధ్యతరగతి ప్రజలకు ఇస్తామని వివరించారు. గ్లోబల్ సమ్మిట్‌లో ప్రణాళికలు ప్రకటిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గగత కేసీఆర్ ప్రభుత్వం హౌసింగ్ శాఖను నిర్వీర్యం చేసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌసింగ్ శాఖను తిరిగి తాము బలోపేతం చేశామని వివరించారు. గతంలో నిర్మించి మధ్యలో వదిలేసిన ఇళ్లకు కూడా ఇందిరమ్మ పథకం వర్తింపజేయాలని తాము ఆలోచిస్తున్నామని చెప్పుకొచ్చారు. రూరల్‌లో, అర్బన్‌లో ఇళ్ల స్థలం లేని నిరుపేదలకు కూడా త్వరలో శుభవార్త చెబుతామని పేర్కొన్నారు. ఒక విడతలోనే ఇళ్లు ఇచ్చి తాము చేతులు దులుపుకోమని చెప్పుకొచ్చారు. హిల్ట్‌పాలసీ పై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించారు. హిల్ట్ పాలసీపై కేటీఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ అధికారంలోకి వస్తే హిల్ట్ పాలసీ రద్దు చేస్తామని అంటున్నారని... నోటికొచ్చినట్లుగా కేటీఆర్ మాట్లాడటం సరికాదని హితవు పలికారు. బీఆర్ఎస్ ప్రాంతీయ పార్టీ అని.. వారి హయాంలో ఇష్టం వచ్చినట్లుగా చేశారని ఫైర్ అయ్యారు. తమ ప్రభుత్వం చాలా వినూత్న నిర్ణయాలు తీసుకుంటుందని.. కేసీఆర్ హయాంలో లాగా తాము చేయమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

## దేవాలయాల డబ్బు ఇతరత్రా పనులకు వినియోగించరాదు

మొదటి తరువాయి

విచారిస్తూ న్యాయస్థానం పైవ్యాఖ్యలు చేసింది. ఈ సందర్భంగా.. మీరు ఆలయ డబ్బును ఉపయోగించి బ్యాంకును రక్షించాలను కుంటున్నారా? కష్టాల్లో ఉన్న ఒక సహకార బ్యాంకులో డబ్బు ఉంచే బదులు, ఎక్కువ వడ్డీ ఇచ్చే జాతీయ బ్యాంకుకు ఆ నిధులను మార్చాలని ఆదేశించడంలో తప్పేముందని జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని బ్యాంకుల తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఆ వాదనలతో ధర్మాసనం ఏకీభవించలేదు. దేవుడి డబ్బును తిరిగి చెల్లించడానికి సమయం పొడిగించాలని కోరుతూ మాత్రమే కో-ఆపరేటివ్ బ్యాంకులు హైకోర్టును ఆశ్రయించడానికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ బ్యాంకుల పిటిషన్లను విచారించడానికి మాత్రం నిరాకరించింది. తిరునెల్లి దేవస్థానం ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసిన ఐదు సహకార బ్యాంకులు గడువు ముగిసినా, తిరిగి చెల్లించాలని పదేపదే అడిగినా.. డబ్బు ఇవ్వడానికి నిరాకరించాయి. దీంతో దేవస్థానం హైకోర్టును ఆశ్రయించింది. విచారణ తర్వాత రెండు నెలల్లోగా దేవస్థానం డిపాజిట్ మొత్తాన్ని తిరిగివ్వాలని బ్యాంకులను హైకోర్టు ఆదేశించింది.

## పాక్ రక్షణ దళాల అధిపతిగా మునీర్ నియామకం

మొదటి తరువాయి

అకౌంట్‌లో పోస్టు చేసింది.చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ పాత్రను ఇటీవల పాకిస్థాన్ క్రియేట్ చేసింది. రాజ్యాంగంలో 27వ సవరణ ద్వారా గత నెలల ఈ పాత్రను ఏర్పాటు చేసింది. మిలిటరీ కమాండ్‌ను కేంద్రీకృతం చేసేందుకు పాక్ సర్కారు ఈ నిర్ణయం తీసుకున్నది. అసిమ్ మునీర్‌కు మరిన్ని అధికారాలు ఇవ్వాలని షెహబాజ్ సర్కారు కొన్నాళ్లుగా ప్రయత్నిస్తున్నది. వాస్తవానికి నవంబర్ 29వ తేదీన ఆర్మీ చీఫ్‌గా మునీర్ మూడేళ్ల కాలపరిమితి ముగిసింది. ఎయిర్ చీఫ్ మార్షల్ జహీర్ అహ్మద్ బాబర్ సిద్దు సర్వీసును కూడా మరో రెండేళ్లకు పొడిగించారు. పాక్ సైనిక బలగాల ఆఫీసర్లు ఇద్దరికీ అసిఫ్ అలీ జర్దారి బెస్ట్ విషెస్ చెప్పారు.

# కేసీఆర్‌తో ఏకగ్రీవ సర్పంచ్‌ల భేటీ

మొదటి తరువాయి

ఎన్నికైన ఎర్రవల్లి, నర్సన్నపేట గ్రామ పంచాయతీల సర్పంచులు కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు.తనను కలిసిన గ్రామస్తులతో కేసీఆర్ మాట్లాడుతూ.. మనకు అన్ని కాలాలు అనుకూలంగా వుండవని అన్నారు. కొన్ని కొన్ని సమయాల్లో కష్టాలు వస్తాయి వాటికి వెరవకూడదన్నారు. మల్లా మన ప్రభుత్వమే వస్తుంది. తెలంగాణ పల్లెలకు తిరిగి మంచిరోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అప్పుడిదాకా ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో అధైర్య పడొద్దన్నారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం అందించిన స్ఫూర్తితో స్వయంశక్తితో పల్లెలను అభివృద్ధి చేసుకుంటూ ముందుకు నడవాలని సూచించారు.

# బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధిని గాలికొదిలేశారు

మొదటి తరువాయి

గత పాలకులు రైతు రుణమాఫీ చేయలేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేసింది.. రాష్ట్రంలో కోటి 10 లక్షల రేషన్ కార్డులు ఇచ్చాం.. 3 కోట్ల 10 లక్షల మందికి ఈ ప్రభుత్వం సన్న బియ్యం ఇస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. వరంగల్ విమానాశ్రయం కోసం గత సీఎం కేసీఆర్ ఏనాడూ ప్రయత్నించలేదు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించి కొత్తగా ఒక్క ఎయిర్‌పోర్టు ను కూడా సాధించలేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం వరంగల్ జిల్లా నర్సంపేటలో పర్యటించారు. రూ.532 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం నర్సంపేటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. వరంగల్ గడ్డకు చెందిన ఎందరో వీరులు తమ పరాక్రమాన్ని ప్రపంచానికి చూపారు. కాకతీయ యూనివర్సిటీ పోరాటాలు ఎప్పుడూ స్ఫూర్తినిస్తాయి. తెలంగాణ వస్తే.. సమస్యలు పరిష్కారం అవుతాయని ఈ జిల్లా ప్రజలు ఆశించారు. కుర్చీలో కూర్చున్న వారి ఆస్తులు పెరిగాయి కానీ, ప్రజల జీవితాలు మారలేదు. మీ ఓటునే ఆయుధంగా మార్చి.. గడీల పాలనను కూల్చారు. ప్రజాపాలనకు రెండేళ్లు పూర్తవుతోంది. వరి వేస్తే.. ఉరి వేసుకున్నట్టే అని ఆనాటి సీఎం కేసీఆర్ అన్నారు. ఈ ప్రభుత్వం మాత్రం.. రైతు పండించిన చివరి గింజ వరకు కొంటోంది. కాంగ్రెస్ వస్తే.. కరెంట్ ఉండదని ఆనాటి సీఎం దుష్ప్రచారం చేశారు. రైతు బంధు బంద్ అవుతుందని ప్రజలను బెదిరించారు. కాంగ్రెస్ పవర్‌లోకి వచ్చాక.. రాష్ట్రాన్ని దోచుకున్న వారి పవర్ మాత్రమ్ కట్ అయ్యింది.



వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌పై పేటెంట్ హక్కు ఉన్నది కాంగ్రెస్‌కు మాత్రమే. గత సీజన్‌లో 9 రోజుల్లోనే రూ.9వేల కోట్లను రైతు భరోసా కింద ఇచ్చాం. ఈ దేశంలో వరి అత్యధికంగా పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే. సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నాం. గత ప్రభుత్వంపదేళ్లపాటు పేదలకు కొత్తగా ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. రాష్ట్రంలో 1.10 కోట్ల రేషన్ కార్డుల ద్వారా.. 3.10 కోట్ల మంది లబ్దిదారులకు సన్నబియ్యం ఇస్తున్నాం. రేషన్ కార్డుల్లో కొత్తవారికి చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించాం. సన్నబియ్యం ద్వారా పేదల ఆకలి తీరుస్తున్నాం అని సీఎం అన్నారు. రేవంత్ తో సహా వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి. వరంగల్ ఎమ్మెల్యేలు, నాయకులు, అధికారులు సీఎం రేవంత్ కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నర్సంపేటపై వరాల జల్లు కురిపించారు సీఎం రేవంత్. రూ.532.24 కోట్లతో నర్సంపేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు సీఎం. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ÷ఔ.130 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల, వసతి గృహాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ÷ఔ.82.56 కోట్లతో హన్మకొండ-నర్సంపేట-మహబూబాబాద్ రోడ్డు విస్తరణ, మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. ÷ఔ.17.28 కోట్లతో నర్సంపేట- పాఖాల రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 56.40 కోట్లతో నర్సంపేట నుంచి నెక్కొండ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.26 కోట్లతో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 20 కోట్లతో నర్సంపేట పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వైఎస్ హయాంలో 25 లక్షల ఇందిరమ్మ ఇళు కట్టించి పేదవాళ్లకు ఇచ్చారు.. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్.. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తానని హామీ ఇచ్చి పేదల్ని మోసం చేశారు.. పేదల ఆత్మ గౌరవం పెంచేందుకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం.. 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ కు ఏమేమి ఉన్నాయో వరంగల్ కు కూడా అవే తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. మార్చి 31 లోపల వరంగల్ లో ఎయిర్ పోర్టును ప్రారంభించుకుంటామన్నారు. వరంగల్ లో అండర్ డ్రైనేజ్, ఔటర్ రింగ్ రోడ్డును నిర్మించుకుంటాం.. సౌర విద్యుత్ ని ఉత్పత్తి చేసే బాధ్యతను మహిళలకు అప్పగించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# ఉగ్రవాదంపై పోరులో భారత్‌తో కలసి నడుస్తాం

మొదటి తరువాయి

భారత్-రష్యా మధ్య 64 బిలియన్ డాలర్ల వ్యాపారం జరిగింది. ఇరుదేశాల మధ్య ట్రేడ్ మరింత పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆయిల్ సహా అన్ని రంగాల్లో సహకారం అందిస్తాం. ఉమ్మడి ప్రాజెక్టులు, సాంకేతిక అంశాల్లో పరస్పర సహకారం ఉంటుంది. సొంత కరెన్సీల్లో ఇరుదేశాల మధ్య వాణిజ్యం జరుగుతోంది. కొడంకుళం అణువిద్యుత్ ప్రాజెక్టుకు సహకరిస్తాం. విద్యుత్ రంగంలో ఖర్చు తగ్గింపునకు సాయం అందిస్తాం. భారత్‌తో కీలక ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. భారత్‌కు నిరంతరంగా ఇంధనాన్ని సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు. భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష పదవిని చేపడుతుందని అధ్యక్షుడు పుతిన్ తెలిపారు. వచ్చే ఏడాది భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష పదవిని చేపడుతుందన్నారు. భారత్‌కు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తామన్నారు. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని ఆపటానికి ప్రధాని మోదీ ఎంతో ప్రయత్నిస్తున్నారని చెప్పారు. యుద్ధం ఆపే ప్లాన్ గురించి తనకు వివరించి చెప్పారని అన్నారు. అమెరికా లాంటి దేశాల నుంచి వాణిజ్య ఒత్తిడులు ఎదురైతున్నప్పటికీ .. భారత్-రష్యా మధ్య ఇంధన సరఫరా కొనసాగుతుందని స్పష్టం చేశారు. పశ్చిమ దేశాల నుంచి వస్తున్న ఒత్తిడుల



కారణంగా కొంతకాలంగా చమురు దిగుమతులను భారత్ తగ్గించినప్పటికీ.. ఆ దేశాభివృద్ధికి సహకరించడం కోసం సరఫరాను పెంచేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. గతేడాది భారత్-రష్యా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 12 శాతం పెరిగి.. రికార్డు సృష్టించిందని రష్యా అధ్యక్షుడు అన్నారు. ఈ ఏడాది కూడా ఇదే స్థాయిలో పెరుగుదల ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు చేరుతుందని పుతిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. రక్షణ సహకరాన్ని కూడా మరింత విస్తరిస్తామని తెలిపారు. రష్యా దృష్టి పెట్టాల్సిన కీలక సవాళ్ల గురించి మోదీ తనతో చర్చించారని.. భారత్-యురేషియా ఆర్థిక సంఘం మధ్య స్వేచ్ఛా వాణిజ్య మండలాన్ని సృష్టించడం వంటి వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. అంతే కాకుండా భారత్-రష్యా క్రమంగా చెల్లింపుల కోసం తమ జాతీయ కరెన్సీలను ఉపయోగించే దిశగా కదులుతున్నాయని.. దాదాపు 96 శాతం వాణిజ్య చెల్లింపులు జాతీయ కరెన్సీలలోనే జరుగుతున్నాయన్నారు. మీడియా సమావేశంలో మోదీ మాట్లాడుతూ.. ఉగ్రవాదంపై పోరుకు భారత్- రష్యా కలిసి నడుస్తాయన్నారు. ఇటీవల పహల్గాంలో జరిగిన దాడికి, గతేడాది రష్యా రాజధాని మాస్కో లోని క్రాకస్ సిటీ కాన్సర్ట్ హాల్‌లో జరిగిన దాడికి మూల కారణం ఉగ్రవాదమేనని అన్నారు. మానవత్వ విలువలపై చేస్తున్న ఈ ప్రత్యక్ష దాడులకు వ్యతిరేకంగా ఉగ్రవాదంపై పోరుకు ఇరుదేశాలు ఏకమైనట్లు తెలిపారు. భారత్, రష్యా, యూఎన్, జీ20, బ్రిక్స్ వేదికలు సన్నిహిత సహకారాన్ని కలిగి ఉన్నాయని.. ఈ వేదికలన్నింటిలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సహకారాన్ని కొనసాగిస్తామన్నారు.

## వెనుకబడిన పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ

మొదటి తరువాయి

పాల్గొని ప్రసంగించారు. తమ ప్రభుత్వంలో అత్యాధునిక విద్యను అందించడానికి కృషి చేస్తున్నామని వ్యాఖ్యానించారు. ఆ దిశగా ఉపాధ్యాయుల్లో నైపుణ్యాలు పెంపొందించ డానికి విదేశాల్లో శిక్షణ ఇస్తున్నామని వివరించారు. వారి ద్వారా దశల వారిగా.. ఉపాధ్యాయులు అందరికీ.. ప్రపంచ స్థాయి విద్యపై శిక్షణ ఇస్తామని తెలిపారు. గతంలో ఉపాధ్యాయులను అనేక వేధింపులకు గురి చేశారని ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ ఉపాధ్యాయులను గౌరవించడమే ప్రథమ కర్తవ్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను గౌరవించటంతో పాటు పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దుతామని వ్యాఖ్యానించారు సీఎం చంద్రబాబు. కేంద్రంలో వికసిత్ భారత్ తీసుకువస్తే రాష్ట్రంలో స్వర్ణాంధ్రా నినాదంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో పిల్లలు, ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి, ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరుతారని తాను ఆశిస్తున్నానని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు. మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో వినూత్నమైన మార్పులు చేయడం అభినందనీయమని ప్రశంసించారు. ముస్తాబు కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి తీసుకువచ్చారని కొనియాడారు. ముస్తాబు కార్యక్రమాన్ని రాష్ట్రంలో అన్ని పాఠశాలలు, కళాశాలల్లో తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ప్రస్తుతం వినూత్నమైన ఆలోచనలతో ముందుకెళ్తున్నారని.. నూతన ఆవిష్కరణలు రూపొందిస్తున్నారని ప్రశంసించారు. ఈ ఏడాది జనవరిలో స్టూడెంట్ ఇన్నోవేషన్ సమ్మిట్ నిర్వహిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. విద్యార్థులు నైతిక విలువలు అలవర్చుకోవాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. పిల్లలు అంటే తనకు చాలా ఇష్టమని.. అందుకే సీఎం చంద్రబాబును అడిగి విద్యాశాఖను తీసుకున్నానని ప్రస్తావించారు. తనకు పేరెంట్స్ మీటింగ్స్ అంటే చాలా భయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రకేసరి విద్యార్థి దశను ప్రస్తావించారు. అలాగే, శ్రీకాకుళం జిల్లా రచయిత కారా మాస్టరు (కాళీపట్నం రామారావు) సేవలను కొనియాడారు. తాను చదువుకున్నప్పుడు ఎప్పుడూ తన తల్లిదండ్రులు పేరెంట్స్ మీటింగ్‌కు రాలేదని చెప్పుకొచ్చారు. పిల్లలు, తల్లిదండ్రుల త్యాగాలను మరవకూడదని సూచించారు. తల్లి ప్రేమ, తండ్రి త్యాగం ఎంతో గొప్పదని చెప్పుకొచ్చారు. తల్లికి చెప్పలేని ఏ పని కూడా చేయకూడదని సూచించారు. మహిళలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు మంత్రి నారా లోకేశ్. పాఠ్యపుస్తకాల్లోనూ.. కవర్ పేజీల్లో ఎక్కడ కూడా మహిళలు ఇంటి పని చేస్తున్న చిత్రాలు ప్రచురించకుండా తగ్గించామని చెప్పుకొచ్చారు. 906 పాఠశాలల్లో అనేక విద్యా సంస్కరణలు తీసుకువచ్చామని వివరించారు. ఉపాధ్యాయుల బదిలీల్లో పారదర్శకత తీసుకువచ్చామని పేర్కొన్నారు. లీప్ యాప్ ద్వారా పిల్లల ప్రగతి, హాజరు, ఇతర విషయాలన్నీ తల్లిదండ్రులు తెలుసుకునే సదుపాయం కల్పించామని వివరించారు.

## సాయి ఈశ్వర్ మరణానాకి ప్రభుత్వానిదే బాధ్యత

మొదటి తరువాయి

పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు కేవలం 17 శాతానికే కుదించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలకు వెన్నుపోటు పొడిచారని కేటీఆర్ మండిపడ్డారు. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యేనని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా సాయి ఈశ్వర్ మరణానికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కులగణనను మొదలుకుని న్యాయస్థానాల్లో నిలబడని జీవోల దాకా కాంగ్రెస్ ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా కామారెడ్డి డిక్లరేషన్‌కు సమాధి కట్టిందని కేటీఆర్ అన్నారు. బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం 50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పేరిట సీఎం రేవంత్ రెడ్డి ఆడిన రాక్షస రాజకీయ క్రీడలో తమ్ముడు సాయి ఈశ్వర్ బలైపోవడం తనను తీవ్రంగా కలిచివేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. బీసీ బిడ్డ ఆత్మబలిదానానికి కారణమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీసీ సమాజం ఎన్నటికీ క్షమించదని తెలిపారు. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్య అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి అధికార దాహానికి బలైన ప్రాణం ఇది అని పేర్కొన్నారు. సాయి ఈశ్వర్ ఆత్మకు శాంతి కూరాలని ఆ దేవుడిని హరీశ్‌రావు ప్రార్థించారు. బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని, రూ. 50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని సాయి ఈశ్వర్ ఇటీవల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తీన్మార్ మల్లన్నను కలవడానికి వెళ్లిన సాయిఈశ్వర్ గురువారం సాయంత్రం.. ఆయన ఆఫీసు ముందు పెట్రోల్ పోసుకుని నిప్పటించుకున్నాడు. ఇది గమనించిన స్థానికుల్గు ÷రిరజన్, పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న వారు మంటలను ఆర్పివేసి సాయిఈశ్వర్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడే పరిస్థితి విషమించడంతో శుక్రవారం సాయిఈశ్వర్ ప్రాణాలు కోల్పోయాడు.


# లింగోటం గ్రామపంచాయతీ కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్



**అచ్చంపేట, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మండల పరిధిలో లింగోటం గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరపున తాడెం జయప్రకాశ్ నామినేషన్ దాఖలు చేశారు. గ్రామపంచాయతీ అధ్యక్షుడు నేతల తిరుపతయ్య బలపరిచారు. నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

# గుర్తులతో అభ్యర్థుల గుండెల్లో గుబులు

**పాలకుర్తి, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



స్థానిక సంస్థల ఎన్నికలలో అభ్యర్థులకు కేటాయించిన గుర్తులు చూసి గుబులు మొదలయ్యాయి. నామినేషన్ విత్‌డ్రా తర్వాత బ్యాలెట్ పేపర్ నమూనాతో గుర్తులు కేటాయించగా, కొన్ని గుర్తులు ఒకేలా కనిపించడం అభ్యర్థుల్లో అసంతృప్తి కలిగిస్తోంది. ఉంగరం, బాల్, బకెట్ ఒకేలా ఉండటం, రిమోట్, టూత్‌పేస్ట్, స్పానర్, వేణువు ఒకేలా కనిపించడం, మంచం, పలక, టేబుల్, నల్లబోర్డు, బిస్కెట్, బెండకాయ, కొబ్బరి తోట, వికెట్లు ఒకేలా ఉండటం ఓటర్లలో అయోమయం కలిగించే అవకాశం ఉందని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కళ్ళు బాగా కనిపించని వృద్ధులు గుర్తులు అర్థం చేసుకోలేక తప్పుగా ఓటు వేయవచ్చని భయం వ్యక్తమవుతోంది. చెప్పుల గుర్తు వచ్చిన అభ్యర్థి ప్రచారం ఎలా చేస్తాడోనని ఓటర్లు సరదాగా సెటైర్లు వేస్తున్నారు. ఏది ఏమైనా, ఈ గుర్తులు అభ్యర్థుల గెలుపు%-%ఓటములకు కారణం కావచ్చని గ్రామాల్లో చర్చ సాగుతోంది.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్


**కరీంనగర్, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



జగిత్యాల స్వయం ప్రతిపత్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగంలో పనిచేస్తున్న అధ్యాపకురాలు, కాకతీయ విశ్వవిద్యాలయం నుండి డాక్టర్ క్రిస్టఫర్ రూబెన్ పర్యవేక్షణలో "టిష్యూ కల్చర్, ఫైటో కెమికల్ అనాలసిస్ మరియు ఫార్మకాలజికల్ స్టడీస్ ఇన్ రూబియా కార్డుఫోలియా" అనే శీర్షికపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. ఈ విజయంపై కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కల్వకుంట్ల రామకృష్ణ, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ప్రమోద్ కుమార్, చంద్రయ్య, డాక్టర్ సంగీత, డాక్టర్ శ్రీలత, నీరజ, మల్లికార్జున్, డాక్టర్ వాసవి, డాక్టర్ జమున తదితరులు అభినందనలు తెలిపారు.

# అంతర్జాతీయ స్వచ్ఛంద దినోత్సవం సందర్భంగా రక్తదానం

**కరీంనగర్, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




అంతర్జాతీయ స్వచ్ఛంద దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి ఐటిఐ టీచర్ అనిల్ కుమార్ తన 14వ సారి ఏ పాజిటివ్ రక్తదానం చేశారు. కరీంనగర్ ద్వారకామాయి ప్రైవేట్ వైద్యశాలలో మొద్దముపురు గ్రామానికి చెందిన డెలివరీ మహిళకు అత్యవసరంగా రక్తం అవసరమని తెలిసి, డ్యూటీ నుంచి అనుమతి తీసుకుని వెంటనే కరీంనగర్ చేరి సకాలంలో రక్తం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయం, లాభాపేక్ష లేకుండా సామాజిక సేవలో ముందుండే స్వచ్ఛంద సంస్థలు, సేవామూర్తులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఒకరి రక్తదానం ముగ్గురికి ప్రాణదానం అవుతుందని, ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరు 18 నుండి 60 సంవత్సరాల వయస్సులో రక్తదానం చేయాలని సూచించారు. పురుషులు మూడు నెలలకు ఒకసారి, మహిళలు నాలుగు నెలలకు ఒకసారి, అలాగే ప్రతి 15 రోజులకు సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ దానం చేయవచ్చని తెలిపారు. రక్తదానం చేయండి ప్రాణదాతలు అవ్వండి.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుమలకు మద్దతు కోరిన సంఘం



**కరీంనగర్, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ కలెక్టరేట్ సమీపంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు కడారి అయిలన్న కురుమ మాట్లాడుతూ, జిల్లాలో అత్యధిక జనాభా గల కురుమలు నీతి, నిజాయితీకి మారు పేరుగా సమాజంలో కొనసాగుతున్నారని తెలిపారు. స్థానిక సంస్థలలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులుగా అవకాశం కల్పిస్తే స్వంత పనులను పక్కన పెట్టి సమాజానికి నిస్వార్థంగా సేవ చేస్తారని అన్నారు. గతంలో గుంటి మల్లయ్య కురుమ చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా, ఎల్కపెల్లి లచ్చయ్య కురుమ గంగాధర మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చేసిన అభివృద్ధి అందరికీ తెలిసిన విషయమని గుర్తుచేశారు. ప్రస్తుత ఎన్నికల్లో కురుమలను ప్రజా ప్రతినిధులుగా గెలిపిస్తే మచ్చలేని నాయకులుగా గ్రామాలను అభివృద్ధి దిశగా నడిపిస్తారని, ఇప్పుడిప్పుడే గ్రామ స్థాయి నాయకులుగా ఎదుగుతున్న కురుమలను అన్నివర్గాల ప్రజలు ఆశీర్వదించాలని ఆయన కోరారు.

# గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులకు ఇన్స్పైర్ అవార్డ్స్




**పెద్దపల్లి, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఎన్టీపీసీ జ్యోతి నగర్ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో డిసెంబర్ 2 నుంచి 4 వరకు జరిగిన జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన 2025లో గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వాటర్ కన్సర్వేషన్ అండ్ మేనేజ్మెంట్ విభాగంలో జూనియర్ స్థాయిలో 6వ తరగతి విద్యార్థిని ఎన్. సాద్వి ప్రథమ స్థానం, సీనియర్ స్థాయిలో 9వ తరగతి విద్యార్థిని కే. శృతి ప్రియ ద్వితీయ స్థానం సాధించారు. వీరు కామారెడ్డి లో జరగబోయే రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ విద్యతో పాటు వైజ్ఞానిక రంగంలో కూడా ప్రతిభ చూపుతున్న విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని, భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, టెక్నాలజీని ఎదుర్కొనేలా విద్య అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులను అభినందిస్తూ ప్రశంస పత్రాలు, అవార్డులు అందజేశారు.కార్యక్రమంలో కరస్పాండెంట్ అల్లంకి రజనీ దేవి, ప్రిన్సిపాల్ విజయ్, గైడ్ టీచర్ సదానందం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# సోషల్ మీడియా పంచాయతీ ప్రచారం




**పాలకుర్తి, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో సోషల్ మీడియా ప్రధాన వేదికగా మారింది. సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, టెలిగ్రామ్, ట్విట్టర్ ద్వారా తమ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. గెలిస్తే గ్రామానికి చేయబోయే అభివృద్ధి పనులను వీడియోల రూపంలో ప్రజలకు తెలియజేస్తూ, సమయం, ఖర్చు ఆదా అవుతోందని భావిస్తున్నారు. మద్దతుదారులు వాట్సాప్ స్టేటస్, డీపీలతో ప్రచారాన్ని హోరెత్తిస్తుండగా, కొందరు విలేజ్ గ్రూపుల్లో వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని, అలాంటి సందర్భాల్లో చట్టపరమైన చర్యలు తప్పవని బసంతనగర్ ఎస్ఐ నూతి శ్రీధర్ హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో అభ్యర్థులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిన ఎన్నికల కమిషన్, ఓటర్లను ఆకర్షించేందుకు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులు పంపుతున్నారని సమాచారం. ఏది ఏమైనా, ఈ ఎన్నికల్లో సోషల్ మీడియా అభ్యర్థులకు బ్రహ్మాస్త్రంగా మారింది.

# నడింపల్లిలో సిపిఎం పార్టీ నామినేషన్



**నడింపల్లి, నవంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** అచ్చంపేట మండలం నడింపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా సిపిఎం పార్టీ నుండి గుండె లక్ష్మీ దేవమ్మ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో 12 వార్డుల అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని, సీసీ రోడ్లు లేని వార్డుల్లో రోడ్ల నిర్మాణం చేస్తానని, మంచినీటి సమస్యలు పరిష్కరిస్తానని, అండర్ డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేస్తానని తెలిపారు. డిసెంబర్ 17న జరిగే ఎన్నికల్లో తనను గెలిపించాలని గ్రామ ప్రజలను కోరారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా నాయకులు ఎస్. మల్లేష్, గుండె మల్లేష్, ప్రతిపాదకులు నల్లగంటి మల్లయ్య, గిడ్డి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్ట భద్రత

**కరీంనగర్, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో మూడు దశల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు కమిషనర్ గౌష్ ఆలం పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. మూడవ విడత నామినేషన్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆయన స్వయంగా పరిశీలించారు. వీణవంక, జమ్మికుంట, హుజురాబాద్, ఇల్లందుకుంట, సైదాపూర్ మండలాల్లో నామినేషన్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. చల్లూరు, మామిడాలపల్లి, జగ్గయ్యపేట, వల్భాపూర్, నాగంపేట, టేకుర్తి, పెద్దపాపయ్యపల్లి, చిన్నపాపయ్యపల్లి వంటి సమస్యాత్మక కేంద్రాలను సందర్శించి అదనపు బలగాలను మోహరించనున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం



కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లను హెచ్చరించారు. గతంలో నేర చరిత్ర ఉన్న వారిపై బైండోవర్ చర్యలు చేపట్టారు. పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి అన్ని చర్యలు తీసుకుంటామని ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పర్యవేక్షణలో ఏసీపీ మాధవి, ఇన్స్పెక్టర్లు లక్ష్మీనారాయణ, కరుణాకర్, రామకృష్ణ, ఎస్సైలు ఆవుల తిరుపతి, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు షాక్



**హుజురాబాద్, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
స్థానిక ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీలో చేరికల జోష్ పెరుగుతోంది. జమ్మికుంట మండలంలోని మాచనపల్లి గ్రామంలో పలువురు బీజేపీ బూత్ అధ్యక్షులు, బీఆర్ఎస్ మాజీ వార్డ్ సభ్యులు, యూత్ నాయకులు తమ పార్టీలకు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరారు. నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ సమక్షంలో పార్టీ కండువా కప్పి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రణవ్ నాయకత్వంలో హుజురాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ బలపడుతుందని, రాబోయే స్థానిక ఎన్నికల్లో అధిక మెజారిటీ సాధించేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా సరస్వతీ మాత దత్త పౌర్ణమి యజ్ఞం





**కరీంనగర్, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో దత్త పౌర్ణమి యజ్ఞం ఘనంగా జరిగింది. కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, మాదాసు నర్సయ్య లక్ష్మి, ప్రణయ్ నాగరాణి పాల్గొనగా, శంకర్ ఆర్యన్ యజ్ఞాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ సముద్రాల రాజమౌళి మాట్లాడుతూ యజ్ఞం హిందూ ధర్మంలో అత్యంత ప్రాముఖ్యత కలిగినదని, ఇది కేవలం పూజ మాత్రమే కాక మానవ జీవితానికి ఆధ్యాత్మిక, శాస్త్రీయ ప్రయోజనాలను అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ, మేచినేని దేవేందర్ రావు, గట్టు శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్, డాక్టర్ నాళ్ల సత్య విద్యాసాగర్, గోలి పూర్ణచందర్, కొత్తూరి ముకుందం, గట్టు రాం ప్రసాద్, నడిపెల్లి దీన్ దయాల్ రావు, అప్పిడి వకులాదేవి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ అభ్యర్థుల ప్రచారంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి



**సంగారెడ్డి, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సంగారెడ్డి జిల్లా కంది మండలం చేర్యాల గ్రామంలో బీజేపీ బలపరిచిన అభ్యర్థులు పోచారం చంద్రకళ, రాములు తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, రాష్ట్ర నాయకులు రాజేశ్వర్ రావు దేశ్ పాండే, జిల్లా ఉపాధ్యక్షులు వెంకట నరసింహారెడ్డి, పోచారం రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప పడిపూజ

ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలి: ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**గోదావరిఖని: డిసెంబర్ 05**
రామగుండం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ , వారి సతీమణి మనాలి ఠాకూర్ తో కలిసి శ్రీ అయ్యప్ప స్వామి దివ్య పదునెట్టుంబడి మహా పడిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అయ్యప్ప స్వాములు, భక్తులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్మీ ఫ్లాగ్ డే సందర్భంగా విరాళాల సేకరణ ప్రారంభం



**కరీంనగర్, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: ఆర్మీ ఫ్లాగ్ డే (పతాక దినోత్సవం) సందర్భంగా ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌సిసి కేడెట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని కలెక్టరేట్‌లో కలిశారు. ఈ సందర్భంగా విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సేకరించిన విరాళాలను ఆర్మీ సహాయ నిధికి పంపించనున్నట్లు తెలిపారు.

# పారిశుద్ధ్య కార్మికులు, విద్యార్థులకు ప్రత్యేక దంత వైద్య క్యాంపులు



**కరీంనగర్, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలోని పారిశుద్ధ్య కార్మికులు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత దంత వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. ఇందుకోసం సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆమె సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి దంత వైద్యులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్, కరీంనగర్ కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, మల్టీ పర్పస్ వర్కర్లకు ప్రత్యేక క్యాంపుల ద్వారా పరీక్షలు చేయాలని తెలిపారు. అలాగే కస్తూరిబా గాంధీ విద్యాలయాలు, మోడల్ స్కూల్, ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులందరికీ దశలవారీగా దంత పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. దంత సమస్యలు ఎక్కువగా ఉన్న వారిని గుర్తించి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స అందించాలని సూచించారు. క్యాంపుల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల నుండి డిప్యూటేషన్ ద్వారా వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ దంత వైద్యులు రవి ప్రవీణ్ రెడ్డి, రణదీప్, ప్రవీణ్, రాజు, సతీష్ పాల్గొన్నారు.

## పార్లమెంట్‌లో సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ సమస్యపై గళమెత్తిన పెద్దపల్లి ఎంపీ



**పెద్దపల్లి, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సింగరేణి రిటైర్డ్ కార్మికులు ఎదుర్కొంటున్న పెన్షన్ సమస్యపై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఢిల్లీలో పార్లమెంట్‌లో మరోసారి గళమెత్తారు. గత సమావేశంలో ఇదే అంశాన్ని లేవనెత్తిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ, మాజీ కార్మిక మరియు గనుల శాఖ మంత్రి కాకా వెంకటస్వామి ప్రవేశపెట్టిన పెన్షన్ పథకం 30–35 సంవత్సరాలైనా సరైన రీతిలో అప్‌డేట్ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పెన్షన్ 500 –1000 మధ్యే ఉండడం తీవ్రమైన అన్యాయం అని పేర్కొన్నారు. సీఎంపీఎఫ్‌కి గతంలో టన్నుకు 20 కేటాయించినప్పటికీ పెన్షన్ రివిజన్ అమలు కాలేదని తెలిపారు. జీవన వ్యయం 8000–10,000 వరకు పెరిగిన నేపథ్యంలో కనీసం ?10,000 పెన్షన్ ఇవ్వడం అత్యవసరమని డిమాండ్ చేశారు. రిటైర్డ్ కార్మికులు కోర్టులో కేసులు వేసి న్యాయం కోసం పోరాడుతున్నారని వివరించారు. సింగరేణి రిటైర్డ్ కార్మికులకు సరైన న్యాయం చేయాలని, సీఎంపీఎఫ్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని స్పీకర్ ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# షాద్ నగర్‌లో కారు దగ్ధం

## - తప్పిన ప్రమాదం



**షాద్ నగర్,**
**డిసెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ కేంద్రంలో గురువారం రాత్రి ఘోర అగ్ని ప్రమాదం తప్పింది. గురువారం రాత్రి 11:30 గంటల సమయంలో కేశంపేట చౌరస్తా లైబ్రరీ సమీపంలో నడుస్తున్న కారు ఒక్కసారిగా మంటలు అంటుకొని పూర్తిగా దగ్ధమైంది. ఆ సమయంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు అప్రమత్తమై వెంటనే బయటకు దిగడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఫరూక్ నగర్‌కు చెందిన అబ్దుల్ హసీబ్ కారు ఈ ఘటనలో పూర్తిగా కాలిపోయింది.అక్కడికి చేరుకున్న మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం, మధురపురం ఎంపిటిసి కుమార్ రెడ్డి, యువ నాయకుడు మహమ్మద్ ఎజాజ్‌తో పాటు స్థానికులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ముందస్తు జాగ్రత్తగా అంబులెన్స్ వాహనం కూడా అక్కడికి చేరింది.

# ఆర్కపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి గా నామినేషన్ దాఖలు చేసిన దండు రజితశ్రీనివాస్ గౌడ్

**మాడుగుల, డిసెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆర్కపల్లి గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా దండు రజితశ్రీనివాస్ గౌడ్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. బడుగు బలహీన వర్గాల రాజ్యాధికారమే లక్ష్యంగా, అంబేద్కర్ రాజ్యాంగ ఆదేశాలను అనుసరిస్తూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని అందిపుచ్చుకొని, గత 25 సంవత్సరాలుగా గ్రామానికి సేవ చేస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందారు.నిజమైన ప్రజాప్రతినిధులుగా, అభ్యుదయ సాక్షిగా, అన్ని వర్గాల ప్రజల మద్దతుతో, వారి ఆశీర్వాదాలతో సర్పంచ్ అభ్యర్థిగా ముందుకు వచ్చారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా బిజెపి



నాయకులు గోరేటి నర్సిహ్మా, రవి రాథోడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అభ్యర్థిని బలపరిచిన ఆకుతోట జగన్, బండ దుర్గారాం, ఏర్పుల శివలింగం తో పాటు పిప్పల యాదయ్య, జమాలాపురం రాంకిషన్, దండుతిరుపతయ్య, ఆదిమల్ల గిరి, ఏర్పుల సైదులు, సురకారపు జంగయ్య, యాచారపు రాములు, కాస పర్వతాలు, దండు కరుణాకర్, దండు రవిందర్, సిర్పవాడ తిరుపతి, యాచారపు శంకర్, బుర్రి శ్రీను, బండ రామదాసు, బండా మల్లయ్య, యాచారపు గణేష్, విష్ణువర్ధన్ రెడ్డి, విష్ణు యాదవ్, మాజీ సర్పంచ్ దండు వెంకటయ్య గౌడ్, మాజీ వార్డు సభ్యులు కొల్కులపల్లి బిక్కయ్య, వివిధ మహిళ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. నామినేషన్ పర్వం అన్ని వర్గాల ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. భారీ విజయం సాధిస్తామని దండు రజితశ్రీనివాస్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

## చేత్య భూమిని సందర్శించిన స్వేరోస్ కార్యదర్శి కుమార్ షాను





**డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
**డిసెంబర్ 6 హైదరాబాద్**
స్వేరోస్ హైదరా బాద్ నగర కార్యదర్శి కుమార్ షాను తన పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం మహారాష్ట్రలోని బాబాసాహెబ్ అంబేద్కర్ స్మారక చైత్య భూమిని సందర్శించుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ విధంగా ప్రతి ఏటా తన బర్త్ డే సందర్భంగా చైత్య భూమిని సందర్శిస్తూ వస్తున్నారు. ఈ మేరకు బాబాసాహెబ్ అంబేద్కర్ రెండవ మనుమడు భీమ్రావు అంబేద్కర్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాకాల వంశీ, సమత సైనిక్ దళ్ అధికారి వికాస్ కామ్లే తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి

**కరీంనగర్, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నగునూరు నుండి జూబ్లీ నగర్ వెళ్తున్న దారిలో నవంబర్ 30వ తేదీ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, చామనపల్లి గ్రామానికి చెందిన రమేష్ తీవ్ర గాయాలతో బయటపడ్డాడు.గాయపడిన రమేష్‌ను వెంటనే హైదరాబాదులోని యశోద ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అయితే చికిత్స పొందుతూ ఆయన ఈరోజు తెల్లవారుజామున మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి శవపరీక్ష నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతున్నట్లు కరీంనగర్ రూరల్ పోలీస్ ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
శనివారం 06 డిసెంబర్ 2025

# ఘనంగా పద్మశ్రీ ఘంటసాల 103వ జయంతి వేడుకలు

- ఘంటసాల స్వాతంత్ర సమరయోధులు
- ఘంటసాల పాటల ద్వారా ప్రజలను చైతన్యపరిచారు



**వనపర్తి డిసెంబర్ 5( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** వనపర్తి జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయ భవనంలో గురువారం 4 డిసెంబర్ 2025 సిటిజన్ న్యూస్ సీఈఓ డి.రవిప్రసాద్ అధ్యక్షతన & వనపర్తి కళాకారుల ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో గాన గంధర్వులు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జయంతి వేడుకల సందర్భంగా స్వరాంజలి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈనేపథ్యంలో కార్యనిర్వాహకులు,జర్నలిస్టు డి.రవిప్రసాద్ ను కళాకారులు శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజాన్ని పీడిస్తున్న అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపుటకు ఇలాంటి వేదికలు ఎంతైనా అవసరమని వాటిని ప్రోత్సహించడం మన అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం వనపర్తి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జబ్బార్, గంధం నాగరాజు, గాయకులు, గాయనీ మనులు రిటైర్డ్ టీచర్ సత్తార్, నందిమల్ల రాములు, ఉపాధ్యాయులు రవిప్రసాద్ గౌడ్, గంధం రాజు, వెంకట్ పి ఈ టి, ఉపాధ్యాయురాలు శ్రీమతి సుజాత, ఉపాధ్యాయులు నరేందర్, బ్రహ్మయ్య చారి, కార్యక్రమ నిర్వాహకులు గంధం రవి, మోహన్, సంజీవరావు మరియు సంగీత అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా బీజేపీ సర్పంచ్ అభ్యర్థి మెగావత్ రమేష్ నాయక్ నామినేషన్ ర్యాలీ



**మంచాల, డిసెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)** అద్భుత రౌద్రం అపార ఉత్సాహం ప్రజల ఆశీర్వాదాలతో బీజేపీ సర్పంచ్ అభ్యర్థి మెగావత్ రమేష్ నాయక్ నామినేషన్ ర్యాలీ శక్తివంతంగా సాగింది. ఈ ర్యాలీ కేవలం ఓ నామినేషన్ కార్యక్రమం మాత్రమే కాకుండా ప్రజల నమ్మకం, పార్టీ శక్తి, రమేష్ నాయక్ గారి సేవాభావం ప్రతిధ్వనించిన చారిత్రక క్షణంగా నిలిచింది.గ్రామాలు, వార్డులు, బస్తీలు అన్నీ ఒకే స్వరంతో మార్మోగాయి. “రమేష్ నాయక్ మన అభ్యర్థి మన అభిమానం!” అని ప్రజలు హర్షధ్వానాలు చేస్తూ ముందుకు వచ్చారు. అభ్యర్థిపై ఉన్న ప్రేమ, విశ్వాసానికి ఈ ర్యాలీ స్పష్టమైన నిదర్శనంగా నిలిచింది. రమేష్ నాయక్ గారు వినయంతో ప్రజలకు నమస్కరిస్తూ“మీ ఆశీస్సులే నా బలం, మీ అభివృద్ధే నా లక్ష్యం” అని అన్నారు.భారతీయ జనతా పార్టీ జెండాలు రెపరెపలాడగా, ప్రజల ఉత్సాహం శక్తి ప్రవాహంలా మారింది. దేశ సేవలోనూ, గ్రామాభివృద్ధి పథంలోనూ ముందుండే నాయకుడి నామినేషన్ ర్యాలీ ఈరోజు అట్టహాసంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోగిరెడ్డి లచ్చి రెడ్డి విచ్చేసి దిశానిర్దేశం చేశారు. మంచాల్ మండల మాజీ వైస్ ఎంపీపీ దాన్నే భాషయ్య, జిల్లా నాయకులు పోలగోని కొండయ్య, పర్తి నాయక్, బీజేపీ మంచాల్ మండల ప్రధాన కార్యదర్శి కారింగు రాజు, మాజీ బీజేవైఎం మండల అధ్యక్షులు బండి రాజు, మాజీ ఉప సర్పంచ్ కొప్పుల వెంకటేష్, మాజీ వార్డు సభ్యులు కావలి వెంకటేష్, పోలగోని రామచంద్రం, పోలగోని జంగయ్య, సీనియర్ నాయకులు ఎల్లంకి జంగయ్య, మహేశ్వరం వెంకటాచారి, కోయడ బిక్షపతి, కోయడ నరసింహ, బొడ్డుపల్లి వెంకటేష్, బొడ్డుపల్లి నాగరాజు, శక్తి కేంద్రం ఇంచార్జ్ కలగోని శేఖర్, బూత్ అధ్యక్షులు బండి వెంకటేష్, మాధగోని సైదులు, చెరుకు శివ, బొడ్డుపల్లి ప్రకాష్, బీజేవైఎం అధ్యక్షులు దోసపాటి రాణా ప్రతాప్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# బద్ధం రజిత-సుధీర్ ను ఆశీర్వదించి గెలిపించండి తిప్పర్తి ని మోడల్ గ్రామపంచాయతీ గా తీర్చిదిద్దుతా

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**నల్లగొండ, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** శుక్రవారం రోడ్లు భవనముల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తిప్పర్తి లో ప్రచారం నిర్వహించారు గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి శ్రీమతి బద్ధం రజిత-సుధీర్ లకు మద్దతుగా ప్రచారం చేస్తూ

తిప్పర్తి గ్రామపంచాయతీ సర్పంచ్ గా పోటీ చేస్తున్న బద్ధం రజిత-సుధీర్ ను ఆశీర్వదించి గెలిపించాలని గతంలో సర్పంచ్ గా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయినా కూడా నిత్యం మీ మధ్యలో ఉండే యువ నాయకుడు బద్ధం సుధీర్ ఎవరికి ఏ ఆపద వచ్చినా అన్నివేళలా మీకు అందుబాటులో ఉంటాడని కరోనా సమయంలో ప్రాణభయంతో అందరూ ఇండ్లలో ఉంటే సుధీర్ మాత్రం తన ప్రజల కోసం ప్రాణాలకు తెగించి తిప్పర్తి ప్రతి ఇంటిని తట్టి అందరికీ తన వంతు సహాయం చేశాడని కరోనా లాక్ డౌన్ సమయంలో సుమారు 20 లక్షలు వెచ్చించి ప్రతి ఇంటికి కూరగాయలు, నిత్యవసర సరుకులు అందించి తిప్పర్తి ప్రజల పట్ల తనకున్న ప్రేమను చాటుకున్నాడని నన్ను కలిసిన ప్రతిసారి ప్రజా సమస్యలే తప్ప తన కోసమంటూ ఏది అడగని నిస్వార్థ నాయకుడని తిప్పర్తి గ్రామానికి 150 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని నాతో పట్టుబట్టి సాధించాడని. తిప్పర్తిలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం పూర్తి చేసి నిరుపేదలకు పంపిణీ చేయాలని.. అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయడానికి 3 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇండ్లు, ప్రతి ఇంటికి 200 యూనిట్ల విద్యుత్, ప్రతి ఒక్కరికి ఉచితంగా సన్న బియ్యం ఇచ్చి ఇందిరమ్మ రాజ్యం తీసుకొచ్చాం 14 కోట్ల రూపాయలతో తిప్పర్తి గ్రామంలో అభివృద్ధి పనులు ప్రారంభించాం అభివృద్ధి చేసేవారికి ఓటేయండి... తిప్పర్తిని అభివృద్ధి బాధ్యత నాది నిత్యం ప్రజల మధ్య ఉండే నాయకుడు శ్రీమతి బద్ధం రజిత -సుధీర్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించి గ్రామాభివృద్ధి చేసుకోవాలని తెలిపారు.

# ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ




**నాగర్‌కర్నూల్, డిసెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎకో క్లబ్ మరియు తెలంగాణ నేషనల్ గ్రీన్ కాప్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ప్రిన్సిపాల్ మదన్ మోహన్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృత్తిక రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్య కారకాలు నేల నాణ్యతను దెబ్బతీస్తూ జీవవైవిధ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మట్టి కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి పౌరుడు చురుకుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ర్యాలీ సందర్భంగా విద్యార్థులు “సేవ్ సాయిల్”, “ప్రొటెక్ట్ మదర్ ఎర్త్”, “సేవ్ ది ఫ్యూచర్” వంటి నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువుల వినియోగం, రసాయన కాలుష్య నియంత్రణ, మొక్కల పెంపకం వంటి సందేశాలను ప్లకార్డుల ద్వారా ప్రచారం చేశారు.కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో మట్టి నమూనాలను సేకరించి వాటి భౌతిక లక్షణాలపై అధ్యాపకులు విద్యార్థులకు వివరణ ఇచ్చారు. మట్టిలో జీవపరిమాణం తగ్గిపోవడం పర్యావరణ వ్యవస్థపై కలిగించే దుష్ప్రభావాలను వివరించారు. రాబోయే రోజుల్లో కళాశాల స్థాయిలో ప్రత్యేకంగా నేల సంరక్షణపై అవగాహన శిబిరాలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మదన్ మోహన్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు కోదండరాములు, ఉమాదేవి, రామకృష్ణతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# నామినేషన్ ఉపసంహరించుకొని కాంగ్రెస్లో చేరిన బి ఆర్ ఎస్ పక్ష అభ్యర్థులు



**గోపాల్పేట,డిసెంబర్ 05( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** గోపాల్పేట మండలం మున్ననూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలతో రాజకీయ వేడి పెరిగింది. గ్రామ టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కుమారుడు వంగూరు స్వామి తన సర్పంచ్ నామినేషన్‌ను ఉపసంహరించుకొని కాంగ్రెస్‌లో చేరగా, ఆయన వెంట మరో 20 మంది గ్రామ యువకులు కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.వీరికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా 6వ వార్డు ఏకగ్రీవ సభ్యుడు సోడే నరసింహను ఎమ్మెల్యే గారు శాలువాతో సన్మానించారు.కార్యక్రమంలో మండల మత్స్య సహకార సంఘం అధ్యక్షులు సత్యం, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు ధీర మల్లు యాదవ్, నాయకులు నరేందర్ రెడ్డి, రాజు, వెంకట్రాంరెడ్డి, కే.రాములు, కే.చంద్రయ్య, స్వామి, సురేష్, శివశంకర్ గౌడ్, బాలపీరు, రాజేశ్వర్ రెడ్డి, నరసింహ, హరీష్, మధు, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# విద్యావంతులు సామాజిక సేవ చేయాలి

పలుస శంకర్ గౌడ్ జిల్లా అధ్యక్షులు సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా



**వనపర్తి డిసెంబర్ 05( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** విశ్రాంత ఉద్యోగులు విద్యావంతులు తమవంతు సామాజిక సేవలో పాల్గొనాలని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు.మూడున్నర దశాబ్దాలు ఉపాధ్యాయుడిగా ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి శుక్రవారం జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాల నందిపహాడ్ నారాయపేట జిల్లా లో ఉద్యోగ విరమణ చేసిన వెంకట్ రామ్ రెడ్డి ని మహబూబ్ నగర్ పట్టణం భగీరత కాలనీ లోని ఆయన నివాసంలో సాహితీ కళావేదిక పక్షాన శాలువ జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ ఉద్యోగ విధులు నిర్వహించి రిటైర్డ్ అవుతున్న విద్యావేత్తలు తమ విశ్రాంత సమయంలో సామాజిక సేవలో పాల్గొంటూ పలువురికి మార్గదర్శకం కావాలని అన్నారు.ప్రధానోపాధ్యాయుడిగా వెంకట్ రామ్ రెడ్డి విద్యార్థుల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేశారని జిల్లా విద్యాశాఖలో కూడా ఆయన తన సేవలు అందించారని శంకర్ గౌడ్ తెలిపారు. ఈనాటి కార్యక్రమంలో వ్యాఖ్యాత భైరోజు చంద్ర శేఖర్, యువకవి రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అండర్ 19 చెస్ జట్టుకు కోచ్‌గా అనూప్ కుమార్




**కరీంనగర్, డిసెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)** : బెంగళూరులో ఈనెల 5 నుంచి 7 వరకు జరగనున్న 69వ కళాశాలల అండర్ 19 జాతీయ స్థాయి చెస్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టుకు కరీంనగర్ జీనియస్ అకాడమీ డైరెక్టర్, కోచ్ కంకటి అనూప్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. గతంలో పలుమార్లు తెలంగాణ చెస్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన ఆయన, ఈసారి అండర్ 19 జట్టుకు కూడా కోచ్‌గా నియమితులవడం విశేషం.ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు నందలి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, జిల్లా పాఠశాలల కళాశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్‌తో పాటు పలువురు క్రీడా సంఘం బాధ్యులు అనూప్ కుమార్‌ను అభినందించారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
శనివారం 06 డిసెంబర్ 2025

# అట్టహాసంగా లాలపల్లె సర్పంచ్ నామినేషన్ ర్యాలీ





**ఎలిగేడు, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మండలంలోని లాలపల్లె గ్రామ సర్పంచ్‌గా ఏలేటి వెంకట్ రెడ్డి శుక్రవారం భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు చేశారు. గ్రామ ప్రజలతో కలిసి ఊరంతా ఉత్సాహభరితంగా సాగిన ఈ ర్యాలీ, అభ్యర్థిపై ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబించింది. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని తెలిపారు. ప్రజలు ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.


## ప్రతి పేద విద్యార్థి ఉపకార వేతనం పొందేలా అధికారులు మానవతా దృక్పథంతో పనిచేయాలి

-జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నల్లగొండ, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆమె మండల విద్యాశాఖ అధికారులు, సంక్షేమ శాఖల అధికారులతో పాఠశాల విద్యార్థుల స్కాలర్షిప్ ల మంజూరు పై సమీక్ష నిర్వహించారు. వచ్చే శుక్రవారం నాటికి జిల్లాలో స్కాలర్షిప్ ల దరఖాస్తులు 30 శాతం దాటాలని ఆమె లక్ష్యాన్ని విధించారు. ఇందుకు ఎంఈఓ లు అంకితభావంతో పనిచేయాల్సిందిగా కోరారు. ఏమైనా సమస్యలు ఉంటే తక్షణమే తమ దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కులం ధ్రువపత్రం విషయంలో తహసిల్దార్లు జాప్యం లేకుండా సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆదేశించారు. బ్యాంక్ అధికారులు బ్యాంక్ అకౌంట్ ప్రారంభించే విషయంలో పూర్తి సహకారం అందించాలని, విద్యార్థులకు ఇచ్చే స్కాలర్షిప్ లను గ్రీన్ ఛానల్ ద్వారా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎల్ డి ఎం శ్రామిక్ ను ఆదేశించారు. ప్రత్యేకించి స్కాలర్షిప్ల కోసం ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఆ గ్రూపులో సమస్యలను పోస్ట్ చేయాలని చెప్పారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ఎంతోమంది పేదవారు, కుటుంబం లో తల్లి లేదా తండ్రి లేని వారు స్కాలర్షిప్ల కోసం దరఖాస్తు చేసుకొంటున్నారని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖ, సంక్షేమ శాఖల అధికారులు మానవతా దృక్పథంతో ప్రతి విద్యార్థికి స్కాలర్షిప్ వచ్చేలా పనిచేయాలని ఆమె కోరారు.

# మేడ్చల్ -మల్కాజ్గిరి జిల్లాలో దివ్యాంగులకు శుభవార్త



**బోడుప్పల్,డిసెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మల్కాజ్గిరి ఏరియా హాస్పిటల్‌లో సదారం క్యాంపులు ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు సదారం సర్టిఫికెట్ పొందని దివ్యాంగులు ఆన్‌లైన్ మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు చిప్పల శ్రీధర్ తెలిపారు. డిసెంబర్ 16, 22 తేదీల్లో మూగ, చెవిటి వారికి పరీక్షలు నిర్వహించనున్నారు. 4, 11, 18 తేదీల్లో అంగవైకల్యం ఉన్నవారికి, 9న కంటి చూపు సమస్య ఉన్నవారికి, 13, 21 తేదీల్లో మానసిక వికలాంగులకు పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షల ద్వారా వికలాంగుల శాతం నిర్ధారణ చేసి, 40 శాతం పైగా ఉన్నవారిని ప్రభుత్వం సంక్షేమ పథకాలకు అర్హులుగా గుర్తించనుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చిప్పల శ్రీధర్ దివ్యాంగులకు పిలుపునిచ్చారు.

## ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి: ఎమ్మెల్యే కె.పి. వివేకానంద



**కుత్బుల్లాపూర్,డిసెంబర్ 05 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జీహెచ్ఎంసీ జంట సర్కిలైన కుత్బుల్లాపూర్, గాజులరామారం మున్సిపల్ కార్యాలయాలలో చేపట్టనున్న అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే, బిఆర్ఎస్ ఎల్పీ విప్ కె.పి. వివేకానంద్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాజులరామారం సర్కిల్ పరిధిలో వివిధ అభివృద్ధి పనుల కోసం 10 కోట్ల రూపాయలు, కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీలలో 3.50 కోట్ల రూపాయలు మంజూరైనట్లు వెల్లడించారు. రోడ్డు నిర్మాణం, స్మశాన వాటికల అభివృద్ధి, పార్కుల అభివృద్ధి వంటి పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ మంజూరైన నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, స్మశానవాటికలు, పార్కుల అభివృద్ధి పనుల్లో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ, ఎటువంటి ఆటంకం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో గాజులరామారం ఉప కమిషనర్ మల్లారెడ్డి, కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

## దేశ రక్షణకు ప్రాణాలను ఫణంగా పెట్టి అహర్నిశలు కృషి చేస్తున్న త్రివిధ దళాలకు ప్రతి ఒక్కరు సహకరించాల్సిన అవసరం ఉంది : జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి




**నల్లగొండ, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఈనెల 7న నిర్వహించనున్న సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆమె త్రివిధ దళాలకు బాసటగా డొనేషన్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ త్రివిధ దళాలు ఎల్లా వేళలా దేశాన్ని సంరక్షిస్తున్నందునే అందరూ ప్రశాంతంగా బ్రతుకగలుగుతున్నామని, అలాంటి సైనికులకు సహకారం అందించడంలో ప్రతి ఒక్కరు బాసటగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. త్రివిధ దళాల సైనికులకు బాసటగా నిలిచేందుకు ప్రతి సంవత్సరం డిసెంబర్ 7న సాయుధ దళాల పతాక దినోత్సవం గా నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి టి .వనజ, ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, మాజీ సైనికుల సంక్షేమ అసోసియేషన్ అధ్యక్షులు కే.భాస్కర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ రాజు, సభ్యులు శ్రీనయ్య,రాములు తదితరులు ఉన్నారు. ముందుగా ఎన్ సి సి క్యాడెట్లు, స్కౌట్ గైడ్స్ క్యాడెట్లు జిల్లా కలెక్టర్ కు డ్రమ్స్ తో స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు సాయుధ దళాల దినోత్సవ సూచికగా బ్యాడ్జిని అలంకరించగా, జిల్లా కలెక్టర్ సాయిదళాల సహకారార్థం నిధులను డొనేట్ చేశారు.

# డిజిటల్ అరెస్ట్ పేరుతో కానిస్టేబుల్ మోసం ?

### కూకట్పల్లి పోలీస్ స్టేషన్ ముందు యువకుడు ఆత్మహత్యాయత్నం

**కూకట్పల్లి,డిసెంబర్ 05 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కూకట్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనాత్మక ఘటన చోటుచేసుకుంది. డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసపోయిన ఆనంద్ వరప్రసాద్ అనే సాఫ్ట్వేర్ ఇంజనీర్ పోలీస్ స్టేషన్ ముందు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భీమవరం ప్రాంతానికి చెందిన ఆనంద్ వరప్రసాద్ హైదరాబాద్‌లో ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వద్ద ఒక బాయ్స్ హాస్టల్‌లో నివాసం ఉంటున్నాడు. ఇటీవల బెంగళూరులో ప్రయాణం చేస్తూ పరిచయమైన కానిస్టేబుల్ మాటలు నమ్మి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు ఇచ్చాడు. అయితే



ఉద్యోగం కల్పించకపోవడంతో బాధితుడు డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగగా, కానిస్టేబుల్ వేధింపులకు పాల్పడ్డాడని సమాచారం. ఆనంద్‌ను హయత్‌నగర్ పెద్ద అంబర్పేటకు కారులో తీసుకెళ్లి బంధించి, అతని అక్క ద్వారా ఫోన్‌పే ద్వారా 87 వేల రూపాయలు, మరోసారి 50 వేల రూపాయలు వసూలు చేసినట్లు తెలుస్తోంది. అనంతరం అతన్ని అక్కడ వదిలిపెట్టగా, ఎల్బీనగర్ నుంచి మెట్రోలో ప్రయాణించి రాత్రి 12 గంటలకు కూకట్పల్లి పోలీస్ స్టేషన్ ముందు చేరుకున్నాడు. ఆనంద్ బ్లింక్ ఇట్ యాప్ ద్వారా మందులు తెప్పించి సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి అతన్ని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కోసం సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

# బాల్యవివాహాల నిర్మూలనలో మహబూబాబాద్ జిల్లా ముందడుగు

### షేర్ ఎన్ జి ఓ మద్దతు

**మహబూబాబాద్, డిసెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలన కోసం ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల ఇంటెన్సివ్ అవగాహన ప్రచారంకు విస్తృత మద్దతు లభిస్తోంది. బాల్ వివాహ ముక్త భారత్ కార్యక్రమం తొలి వార్షికోత్సవాన్ని ఉత్సాహభరితంగా జరుపుకుంటూ, సొసైటీ ఫర్ హెల్త్ అవేర్నెస్ అండ్ రూరల్ ఎన్విరాన్మెంట్ (షేర్ ఎన్ జి ఓ) ఈ ప్రచారాన్ని ఘనవిజయం దిశగా తీసుకెళ్లేందుకు అన్ని శాఖలతో సమిష్టిగా పనిచేయనున్నట్లు ప్రకటించింది. న్యూఢిల్లీలో కేంద్ర మహిళా %d% శిశు అభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి అన్నపూర్ణా దేవి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ ప్రణాళిక, బాల్యవివాహం అనే నేరాన్ని కొనసాగించే సామాజిక వ్యవస్థను లక్ష్యంగా చేసుకొని రూపొందించబడింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా గ్రామస్థాయి కృషి, నిరంతర చర్యల వల్ల భారతదేశం బాల్యవివాహాలను నిర్మూలించే దిశగా ప్రపంచానికి మార్గదర్శకత్వం



వహిస్తున్నదని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు నోటిఫికేషన్ జారీ చేసి, ఈ ప్రచారంలో సంపూర్ణ భాగస్వామ్యం సాధించాలని ఆదేశించింది. దీనికి ప్రతిస్పందనగా తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, పాఠశాల విద్య, ఉన్నత విద్యా శాఖలకు చెందిన అధికారులు చురుకుగా పాల్గొని ప్రచారం ప్రభావాన్ని మరింత విస్తరించనున్నారు. జిల్లా పరిపాలన చర్యలను అభినందిస్తూ షేర్ ఎన్ జి ఓ సీఈఓ జి. గోపాల్ రెడ్డి మాట్లాడుతూ: “మహబూబాబాద్ జిల్లా పరిపాలనతో సమన్వయంగా పనిచేయడం వల్ల మనం చాలా దూరం ప్రయాణించగలిగాం. దేశం ఏకమై ముందుకు సాగుతున్న ఈ సమయంలో 2030కి ముందే బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించగలమనే నమ్మకం ఉంది. ఒకప్పుడు అసాధ్యంగా అనిపించినది ఇప్పుడు భారతదేశ వాస్తవంగా మారుతోంది” అని అన్నారు. షేర్ ఎన్ జి ఓ, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అల్లియన్స్ భాగస్వామి సంస్థగా, దేశవ్యాప్తంగా 250కిపైగా ఎన్ జి ఓలతో కలిసి బాలల రక్షణ కోసం పనిచేస్తోంది. గత ఏడాది ఈ నెట్వర్క్ సమన్వయంతో ఒక లక్షకు పైగా బాల్యవివాహాలను అడ్డగించింది. ప్రభుత్వం రూపొందించిన 100 రోజుల ప్రచార ప్రణాళిక పాఠశాలలు, విద్యాసంస్థలు, ఆధ్యాత్మిక స్థలాలు, వివాహ సేవలందించే సంస్థలు, గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులపై దృష్టి కేంద్రీకరించింది. ఈ ప్రచారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం – మార్చి 8, 2026న ముగుస్తుంది. మూడు దశలుగా అమలు చేయబడే ఈ కార్యక్రమం పాఠశాలల ద్వారా అవగాహన, మతస్థలాలు మరియు వివాహ సేవలపై దృష్టి, చివరగా గ్రామస్థాయి సమాజ సహకారాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.

## రూపాయి పతనం కేంద్ర వైఫల్యానికి నిదర్శనం

**ఎద్దపల్లి, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేశ ఆర్థిక దిశ క్షీణిస్తోందన్న సంకేతంగా రూపాయి విలువ చరిత్రాత్మకంగా పడిపోవడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేష్ విమర్శించారు. ఆయన మాట్లాడుతూ, 2014లో రూపాయి పాకిస్తాన్, చైనా, బంగ్లాదేశ్‌లో పడిపోలేదని పెద్దఎత్తున విమర్శలు చేసిన ప్రధాని మోదీ, ఇప్పుడు పదేళ్ల పరిపాలన తర్వాత రూపాయి 90 రూపాయలు దాటే స్థాయికి పడిపోవడంపై ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం



సమర్థంగా ఉంటే కరెన్సీ ఈ స్థాయికి పడిపోవదని, రూపాయి పతనం ప్రజలపై ప్రత్యక్ష భారమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూపాయి బలహీనత కారణంగా ఇంధనం, దిగుమతులు, ఎరువులు, ఎలక్ట్రానిక్స్, ఔషధాలు అన్నింటి ధరలు పెరిగాయని పేర్కొన్నారు. ఆసియా దేశాల కరెన్సీలు నిలకడగా ఉండగా భారత్‌లో మాత్రమే క్షీణత కొనసాగడం పాలన వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనమని అన్నారు. ఆర్థిక విధానాల పునర్విమర్శ, ధరల పెరుగుదలపై ఉపశమన ప్యాకేజ్, రూపాయి పతనంపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశం ఎదుగుతుంటే కరెన్సీ బలపడాలి, కానీ రూపాయి పడిపోతే ఏదో దాచిపెడుతున్నారన్న మాట అర్థమవుతుందని విమర్శించారు.

# గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ ఆదేశాలు



**మహబూబాబాద్, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా జరగాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మొదటి అంతస్తు వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో (స్థానిక సంస్థలు), కె. అనిల్ కుమార్ (రెవెన్యూ)తో పాటు మండలాల ప్రత్యేక అధికారులతో కలిసి ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మొదటి విడతలో జరిగే గ్రామపంచాయతీ ఎన్నికలలో ఇప్పటికే ఎన్నికల కమిషన్ సూచించిన ప్రకారం అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి ఒక్కరి విధులను వారికి తెలిసేలా మాస్టర్ ట్రైనర్స్ ద్వారా శిక్షణ తరగతులు నిర్వహించామని తెలిపారు. ప్రతిదీ పారదర్శకంగా జరగాలంటే అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండలాలకు ప్రత్యేక అధికారులుగా ఉన్న సీనియర్ అధికారులు తమ పరిధిలో ఎన్నికల విధులు నిర్వహించే రూట్ మ్యాప్ ప్రకారం అన్ని సరిచూసుకోవాలని, పోలింగ్ కేంద్రాలలో టాయిలెట్స్, త్రాగునీరు, విద్యుత్, కాంపౌండ్ వాల్, ర్యాంప్ వంటి మౌలిక వసతులు ముందుగానే సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని స్వయంగా సందర్శించాలని కూడా సూచించారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ, రవాణా, పోస్టల్ బ్యాలెట్ వంటి ఎన్నికలకు సంబంధించిన ప్రతి పనిని ఎన్నికల కమిషన్ సూచించిన విధంగా పక్కాగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. పోలీస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, తహసిల్దార్లు, సంబంధిత శాఖల వారందరూ ప్రోటోకాల్ ప్రకారం సమన్వయంతో కలిసి ఎన్నికల విజయవంతానికి కృషి చేయాలని సూచించారు. వెబ్‌కాస్టింగ్, స్ట్రాంగ్ రూమ్స్, మైక్రో అబ్జర్వర్ ట్రైనింగ్స్ వంటి మిగిలిన శిక్షణ తరగతులు కూడా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో పురుషోత్తం, డిపిఓ హరిప్రసాద్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్‌తో పాటు అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## వరంగల్ పశ్చిమలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన నియోజకవర్గంలోని 54, 6వ డివిజన్లలో రూ. 4.26 కోట్లతో మంచి నీటి పైప్‌లైన్, సీసీ డ్రైన్, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఒకే రోజు నాలుగు కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గారు ఆయా డివిజన్లలో పలు కాలనీలను సందర్శించి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోందని, ప్రత్యేక దృష్టితో నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. రానున్న రోజుల్లోనే రూ. 1000 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. హనుమకొండ నగరానికి పీసీసీ హోదాలో రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా పనులు జరుగుతున్నాయని అన్నారు. పోచమ్మకుంట శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ప్రత్యేక గదులను ఏర్పాటు చేయడం ద్వారా కిరాయి ఇండ్లలో నివసించే కుటుంబాలకు మరణం భారం కాకుండా చూడాలని శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కాలనీ ప్రజలు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం మాజీ మంత్రివర్యులు తిరువరంగం హయగ్రీవాచారి వర్ధంతి సందర్భంగా అశోక్ జంక్షన్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

# గన్నేరువరంలో బిజెపి బలపరిచిన అభ్యర్థులకు ప్రజల మద్దతు

**గన్నేరువరం, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రెండేళ్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొన్నదని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రజాపాలన పేరిట ఉత్సవాలు నిర్వహించడానికి సిగ్గుండాలని, హామీలు గుప్పించడమే తప్ప ప్రజలకు చేసినది ఏమీ లేదని ఆయన మండిపడ్డారు. శుక్రవారం గన్నేరువరం మండలంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి వారందరికీ కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానం పలికారు. ఆయన మాట్లాడుతూ, స్థానిక ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ మళ్లీ మాయ మాటలు, మోసపూరిత ప్రకటనలతో ప్రజలను



మోసం చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రెండేళ్లలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఫెయిల్యూర్ గవర్నమెంట్ అని ఆయన వ్యాఖ్యానించారు. గ్రామపంచాయతీలు మొదలుకొని రాష్ట్రంలో జరుగుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రమే నిధులు ఇస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ మాయమాటలకు కాలం చెల్లిందని, జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో బిజెపి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి పనులకు కేంద్ర నిధులు వినియోగిస్తున్నారని తెలిపారు. బిజెపి అభ్యర్థులు గెలిస్తే కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ సహకారంతో గ్రామాలను అన్ని విధాల అభివృద్ధి చేసి రూపురేఖలను మార్చే బాధ్యత తీసుకుంటామని గంగాడి కృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. గన్నేరువరం మండల అభివృద్ధికి బండి సంజయ్ ఇప్పటికే అనేక నిధులు మంజూరు చేయించారని, ముఖ్యంగా మానేరు నది పై వంతెన నిర్మాణం కోసం ఆయన ఎంతో కృషి చేశారని వివరించారు.

## బ్రాహ్మణపల్లి కాంగ్రెస్ నాయకుడు నరముని నరేష్ తిరిగి పార్టీలో చేరిక

**అచ్చంపేట, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు నరముని నరేష్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన అనంతరం, తిరిగి పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ము బుచ్చిరాములు కండువా కప్పి నరేష్‌ను ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే



వంశీకృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు గోపాల్ రెడ్డి, మహిళా నాయకురాలు సుశీలమ్మ, మాజీ ఎంపీపీ రామనాథ, మండల పార్టీ అధ్యక్షుడు నరసయ్య యాదవ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఖాదర్, జెడ్పిటిసి మాతృనాయక్ శ్రీను, కుంభం వినయ, రామలక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. నరేష్ తిరిగి పార్టీలో చేరడంతో గ్రామస్థులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

## అమ్రాబాద్ మండలంలో రిజర్వేషన్ గందరగోళం

**అమ్రాబాద్, డిసెంబర్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా ఏజెన్సీ ప్రాంతమైన అమ్రాబాద్ మండలంలోని ప్రశాంత్ నగర్, బి.కే. లక్ష్మాపూర్, వంగురోనుపల్లి, కుమ్మరోనిపల్లి, కలుములోనిపల్లి గ్రామాలలో ఒక్క ఎస్టీ కుటుంబం కూడా లేకపోవడంతో సర్పంచ్ ఎన్నికలు జరగకపోవడం అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్ కేటాయించాలని, ఎస్టీ రిజర్వేషన్ ఎత్తివేయాలని వారు గత కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. మూడో విడతలో జరుగుతున్న స్థానిక ఎన్నికల నామినేషన్ల చివరి రోజైన శుక్రవారం ప్రశాంత్ నగర్ గ్రామంలో నాలుగు ఎస్టీ రిజర్వు, నాలుగు ఎస్సీ రిజర్వు వార్డు మెంబర్లు ఉన్నప్పటికీ ఎస్టీలు ఒక్కరు కూడా లేకపోవడం ప్రత్యేక పరిస్థితిని సృష్టించింది. ఈ నేపథ్యంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు నాలుగు వార్డు మెంబర్లకు నామినేషన్లు వేయకుండా ఎన్నికలను బహిష్కరించారు. తక్షణమే తమకు న్యాయబద్ధంగా రిజర్వేషన్ కల్పించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు పాల్గొని గ్రామస్థుల ఆందోళనకు మద్దతు తెలిపారు.

## విస్తృతంగా కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి మట్ట యాదమ్మ ప్రచారం



**వెల్దండ, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: వెల్దండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్‌తో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రచారాన్ని ఉత్సాహంగా కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు బడుగు, బలహీన వర్గాలను ఆకట్టుకోవడంతో ప్రజల్లో విశ్వాసం పెరిగిందని అభ్యర్థి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మట్ట యాదమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తన విజయానికి తోడ్పడతాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తన విజయానికి ఎంతగానో కృషి చేస్తున్నారని, వారిని ఎప్పటికీ మర్చిపోనని అన్నారు. వెల్దండ అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కత్తెర గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొందుతుందని మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెల్దండ మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, వెల్దండ సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, వెల్దండ పట్టణ అధ్యక్షుడు ఎర్ర శీను, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభల అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య, వెల్దండ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రమేష్, ఎండి రషీద్, పురుషోత్తం, మట్ట భరత్, గుద్ద టి. కిష్టాలు, ఎండి హమీద్, కాంగ్రెస్ నాయకులు మరియు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మిత్రపక్షాల సర్పంచ్ అభ్యర్థి కానుగుల కన్యాకుమారి ఇంటింటి ప్రచారం



**వెల్దండ, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: వెల్దండ మండల కేంద్రంలో బిజెపి బిఆర్ఎస్ మిత్రపక్షాల పొత్తులో భాగంగా బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి కానుగుల కన్యాకుమారి, జోగయ్యతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని గడపగడపకు తిరిగి ఉత్సాహంగా కొనసాగించారు. ఈ ప్రచారంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా కానుగుల కన్యాకుమారి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ప్రవేశపెట్టిన పథకాలే తన విజయానికి బలమని, ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రచార కార్యక్రమంలో బిజెపి కల్వకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ యెన్నం శేఖర్ రెడ్డి, బిజెపి వెల్దండ మండల అధ్యక్షుడు కురుమిద్ద యాదగిరి, మాజీ ఎంపిటిసి జంగయ్య యాదవ్, పిల్లి దేవేందర్, అలాగే బిఆర్ఎస్ నాయకులు వెల్దండ మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్, ఎంపిటిసి జ్యోతి నిరంజన్, మండల యూత్ అధ్యక్షుడు జంగిలి యాదగిరి, జంగిలి ఆనంద్, జంగిలి ప్రసాద్, జంగిలి ప్రవీణ్, జంగిలి రవి, గోరేటి రాజు, టైలర్ వెంకటయ్య, మల్లేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## లష్కర్ గూడ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా సీక సాయికుమార్ గౌడ్



**అబ్దుల్లాపూర్ మెట్. డిసెంబర్ 05 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్ మండలం లస్కర్ గూడ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా గ్రామానికి చెందిన సీక సాయికుమార్ గౌడ్ శుక్రవారం నాడు తన నామినేషన్ లష్కర్ గూడ గ్రామపంచాయతీ ఆఫీసులో ఉన్న ఎన్నికల అధికారికి దాఖలు చేసిన.సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సిక సాయికుమార్ గౌడ్ అనంతరం మాట్లాడుతూ అవకాశం ఇవ్వండి గ్రామాన్ని అభివృద్ధి చేస్తా అనే నినాదంతో ప్రజల్లో కి వెళ్తున్నానని.. గ్రామ అభివృద్ధి నే లక్ష్యంగా చేసుకొని సిసి రోడ్లు,డ్రైనేజీలు వాడవాడల విద్యుత్ వసతులు, యువతకు ఉపాధి, నిరుపేద కుటుంబాలకు సయా సహకారాలు అందిస్తానని అన్నారు. మన గ్రామ అభివృద్ధి లో పెండింగ్ లో ఉన్న సమస్యలు తీర్చేందుకు సమన్వయంతో ముందుకు వెళ్తానని..రాజకీయాలకన్న ప్రజలకు సేవ చేస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని అన్నారు. అలాగే యువకుడు విద్యావంతుడు గ్రామంలో ఏ సమస్య వచ్చినా ముందుండి ఎమ్మటే పరిశీలించి చేసే నాయకుడు గత సర్పంచ్ ఎన్నికల్లో లష్కర్ గూడ నుండి నుండి పోటీ చేసి అ ఎం పీ టీ సీ లో గెలిచి ఉన్న సమస్యలను దగ్గరుండి సమస్యలను పరిశీలించిన నాయకున్ని ఎన్నుకోండి అన్నా అయిపోయిందా ఈ సందర్భంగా గ్రామ ప్రజలను మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ గౌడ్, సిద్ధగోని నరేందర గౌడ్ , సదానంద్ గౌడ్ తో పాటు గ్రామ యువజన బి ఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు దేవరకొండకు సీఎంరాక

### ఎమ్మెల్యే బాలు నాయక్.





**దేవరకొండ డిసెంబర్ 05. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** నేడు దేవరకొండలో జరగనున్న ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల బహిరంగ సభ ప్రాంగణం, హెలిప్యాడ్ స్థల నిర్మాణం మరియు ఇతర ఏర్పాట్లను దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ గవినోళ్ల మధుసూదన్ రెడ్డి ,అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీ కృష్ణ తో కలిసి పర్యవేక్షించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఆయన మాట్లాడుతూ ప్రజలు భారీగా హాజరయ్యే దృష్ట్యా కుర్చీలు, త్రాగునీరు వంటి అవసరమైన సదుపాయాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని అధికారులను సూచించారు.సభ డయాస్ సహా అన్ని తాత్కాలిక నిర్మాణాలపై పలు మార్గదర్శకాలు ఇవ్వడం జరిగింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవరకొండ పర్యటన విజయవంతం కావడానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు.ఈ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం చేతుల మీదుగా శంకుస్థాపనలు చేస్తారు అని అన్నారు.ఈ కార్యక్రమంలో నియోజక వర్గ ముఖ్య నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్రాబాద్ సర్పంచ్ అభ్యర్థిగా చిగుర్ల కోటయ్య నామినేషన్



**అమ్రాబాద్, నవంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమ్రాబాద్ మేజర్ గ్రామ పంచాయతీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చిగుర్ల కోటయ్య, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆదేశాల మేరకు శుక్రవారం నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఆయనతో పాటు 14 వార్డుల అభ్యర్థుల నామినేషన్లు కూడా సమర్పించారు.ఈ సందర్భంగా కోటయ్య మాట్లాడుతూ, అమ్రాబాద్ అంటే కేవలం ఒక ఊరు కాదు, మా ఇల్లు. ఇక్కడి ప్రతి సమస్య నా సమస్య. ప్రజాసేవలో నిరంతరం ఉంటూ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే నా లక్షం అని తెలిపారు. గ్రామ భవిష్యత్తు కోసం ప్రజలు తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నామినేషన్ కార్యక్రమంలో పంచాయతీ ఎన్నికల పరిశీలకులు, అచ్చంపేట మాజీ సర్పంచ్ పిల్లి హరిచంద్ర, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు బాల్ లింగం గౌడ్, ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షుడు చింతల రాజగోపాల్, మాజీ ఎంపీపీ అవుట్ శ్రీనివాసులు, మాజీ కోఆప్షన్ ముక్రమ్ ఖాన్, పోల సత్యనారాయణ, సయ్యద్ ఆరిఫ్, జమీల్ ముఖ్బుల్, ఎల్ల స్వామి, నోముల సురేష్, రాజారాం, కృష్ణయ్య, నిరంజన్, మల్లేష్, అహ్మద్ గౌస్, యాదయ్యతో పాటు అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్పంచి బరిలో ఉండేది ఎవరు.. ఊడేది ఎవరు..?





-సర్పంచ్ ఎన్నికలకు పోటాపోటీ
- నేడు గుర్తులు కేటాయించునున్న అధికారులు
- లక్షలు ఖర్చు చేసేందుకైనా వెనకడుగు వేయని అభ్యర్థులు
- ఓడితే పరిషత్ వైపు...



**కద్వాల్, డిసెంబర్ 05 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా సర్పంచ్ స్థానాలకు పోటీపడుతున్న అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. ఇప్పటికే వారికి ప్రధాన పార్టీల ముఖ్య నాయకుల మద్దతు లభించగా ఎన్నికల్లో సత్తాచాటేందుకు అన్ని అస్త్రాలను ఉపయోగిస్తున్నారు. రిజర్వేషన్ల వారీగా గెలుపు గుర్రాలకే అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు మద్దతు తెలుపగా తమ శాయశక్తుల ప్రయత్నిస్తూ ఎన్నికల్లో గెలుపొందేందుకు అభ్యర్థులు ఉవ్విళ్లూరుతున్నారు. ఒక వేళ సర్పంచ్ ఎన్నికల్లో ఓడినా రాబోయే జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల్లోనైన పైచేయిసాధించాలనే తపనతో అధికశాతం మంది అభ్యర్థులు ఉన్నారు. ఇందు కోసం ఇప్పటి నుంచే వారు తమ ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. ఎలాగైనా స్థానిక ఎన్నికల్లో గెలుపొందాలనే పట్టుదలతో ఉన్న అభ్యర్థులు సర్పంచ్ కాకపోతే ఎంపీటీసీ, జడ్పీటీసీలుగానైనా ఎన్నికవ్వాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందు కోసం గ్రామాల ప్రజలను తమ వైపు ఆకర్షించేలా ప్రత్యేక కార్యాచరణ చేపడుతూ వస్తున్నారు. మొత్తంగా ఈసారి ఎన్నికలను మిస్ చేసుకోవద్దనే దృఢమైన లక్ష్యంతో అభ్యర్థులు పోటీపడుతుండడం గమనార్హం.

**నేడే గుర్తుల కేటాయింపు**

సర్పంచి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు నేడు అధికారులు గుర్తులు కేటాయించునున్నారు. లక్షలు ఖర్చు అయినా గెలుపే లక్షంగా కృషి చేయాలని అభ్యర్థులు ఇంటింటి ప్రచారం మమ్మరం చేశారు. శనివారం నామినేషన్ దరఖాస్తుల విత్ డ్రా నేపథ్యంలో బరిలో ఎవరు ఉంటారు.. పోటీ నుంచి ఎవరు తప్పుకుంటారన్న వార్తలు ప్రజల్లో చర్చ జరుగుతుంది.

## కబ్జాలాపూర్‌గా మారిన కుత్బుల్లాపూర్ : కల్వకుంట్ల కవిత



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కుత్బుల్లాపూర్‌ను కబ్జాలాపూర్‌గా పేరు మార్చినా తేడా ఉండదేమోనని ఇక్కడి పరిస్థితులు చూస్తే అర్థమవుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు.జనం బాటలో భాగంగా శుక్రవారం ఆమె జాగృతి బిసి రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి మారయ్య ఆధ్వర్యంలో శాపూర్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి, ఆసుపత్రి సిబ్బంది, రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గాజులరామారంలోని పరికి చెరువు, సూరారం లింగం చెరువులను పరిశీలించి చెరువులపై జరుగుతున్న అక్రమణలపై స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మల్లంపేటలో జాగృతి లోకి చేరిన కొత్త సభ్యులకు కండువా కప్పి ఆహ్వానం పలికారు. గాగిల్లాపూర్‌లో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా పరిశీలించారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, 60 ఎకరాల్లో విస్తరించి ఉండాల్సిన పరికి చెరువు ఇప్పుడు 16 ఎకరాలకు కుదించుకుపోయిందని, చెరువు పరిరక్షణ కోసం స్థానికులు ఎన్నో కేసులు వేసినా ఫలితం లేకపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువుల కబ్జా తతంగంలో అన్ని పార్టీల నాయకుల ప్రమేయం ఉందని ఆరోపించారు. ఎఫ్టీఎల్‌లో ఉన్నప్పటికీ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం గత పాలకుల, అధికారుల అలసత్వమని మండిపడ్డారు. రియల్ ఎస్టేట్ మాఫియా భయంలేకుండా ఎఫ్టీఎల్ రాళ్లను కూడా తొలగించారని, దీనిపై హైడ్రా కమిషనర్ తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇక్కడి ఎమ్మెల్యే గతంలో టీడీపీ లో ఉండి బీఆర్ఎస్ లోకి వచ్చారని, రేపు ఎక్కడ ఉంటారో తెలియదని వ్యాఖ్యానించారు. ఆయన అండదండలతోనే చెరువుల కబ్జాలు జరిగాయని ఆరోపించారు. పేదవారి ఇళ్లే కాదు, పెద్దవారి ఇళ్లను కూడా కూల్చే ధైర్యం చూపించాలని అన్నారు.గత ఎన్నికల్లో జగద్గిరిగుట్ట బస్సు డిపో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధులు ఇప్పటి వరకు ఆ వాగ్దానం నెరవేర్చలేదని, మెడికల్ కాలేజీ మంజూరైనప్పటికీ ఏర్పాటు చేసే దమ్ము లేదని ప్రశ్నించారు. కుత్బుల్లాపూర్‌లో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ప్రభుత్వం వెంటనే పూర్తి చేసి పేదలకు అందజేయాలని డిమాండ్ చేశారు.ప్రజల పక్షాన జాగృతి పోరాటం చేస్తుందని, పేదలకు న్యాయం చేయకుండా మోసం చేస్తే తాట తీస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర నాయకులు ఇస్మాయిల్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాగిడి వెంకటరామిరెడ్డి, అధికార ప్రతినిధి పడాల మనోజ్, శీలం వీరేందర్, సీతారాం, సంధ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాధవానిపల్లి సర్పంచ్ అభ్యర్థిగా దాసరి స్వరాజ్యలక్ష్మి నామినేషన్




**అమ్రాబాద్, నవంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమ్రాబాద్ మండలం మాధవానిపల్లి గ్రామ పంచాయతీ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా దాసరి స్వరాజ్యలక్ష్మి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ప్రతిపాదన మేరకు స్వరాజ్యలక్ష్మి అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు. గ్రామ ప్రజలు ఆమెను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు విజ్ఞప్తి చేశారు.స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ, "గ్రామ అభివృద్ధి లక్ష్యంగా చదువుకున్న వ్యక్తిగా, ఆదివాసి బిడ్డగా, ప్రజాసేవలో ముందుకు వస్తున్నాను. మాధవానిపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం"లి అని తెలిపారు.గ్రామ ప్రజలందరూ ఆమెను ఆదరించి ఆశీర్వదించాలని, అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

# సైనికుడే మన సేవకుడైతే

-గోనబోయినపల్లిలో చారిత్రక ఘట్టం
-మునుపెన్నడూ లేని విధంగా సర్పంచ్ బరిలో మాజీ సైనికుడు.
-మార్పు మొదలైందంటున్న గ్రామ ప్రజలు.
-దేశం కోసం 30 సం"ల సుదీర్ఘ సేవ.
-ఎన్ ఎస్ జి కమాండ్ గా పదవి విరమణ.
-సొంత ఊరికి మంచి చేయాలన్న తపన.
-సమాజసేవలో ముందుంటానంటున్న వర్కాల భావనారాయణ ఎక్స్ ఆర్మీ.





**దేవరకొండ డిసెంబర్ 05. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** నల్లగొండ జిల్లా డిండి మండల పరిధిలో గల గోనబోయినపల్లి గ్రామం లో ఒక రాజకీయ నూతన చారిత్రక ఘట్టం నెలకొంది.మునుపెన్నడూ లేనివిధంగా సర్పంచ్ బరిలో మాజీ సైనికుడు వర్కాల బాలనారాయణ అన్ని వర్గాల ప్రజల మద్దతుతో పంచాయతీ ఎన్నికలలో భాగంగా మూడవ విడత తేది:05.12.2025 నాడు మండల పోలింగ్ అధికారిగారికి తను సర్పంచ్ అభ్యర్థిగా బరిలో కొనసాగుతున్నట్లుగా పెద్ద ఎత్తున ప్రజా బలాన్ని కూడగట్టుకొని నామినేషన్ దాఖలు చేశారు.అది చూసిన గోనబోయినపల్లి గ్రామ ప్రజలు ఇదొక శుభ పరిణామమని 1964 నుండి నేటివరకు పంచాయతీ ఎన్నికలకు ఇలాంటి వ్యక్తుల నుంచి పెద్దగా ఆసక్తి కనపడలేదని ఇప్పుడు మార్పు మొదలైందని ఊరికి మంచిరోజులు రాబోతున్నాయని పలువురు తమ ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. సర్పంచ్ అభ్యర్థిగా బరిలో దిగిన భారత మిలిటరీ మాజీ సైనికుడు వర్కాల బాలనారాయణ ఎక్స్ ఆర్మీ మాట్లాడుతూ తను మన భారతదేశం కోసం 30 సం"లుగా సుదీర్ఘ సేవలు అందించానని ఎన్ ఎస్ జి కమాండో గా పదవీ విరమణ పొందాననని అప్పటి నుండి స్వంత ఊరికి ఏదైనా మంచి చేయాలనే సంకల్పంతో ఎన్నో సంవత్సరాలుగా తీరని కళగా మిగిలిపోయిన గోనబోయినపల్లి నుండి సిద్ధాపురం రోడ్డు డిండి(దెంది)చెక్ డ్యాం వంటి అంశాల మీద ఇప్పటికే తన స్వంత ఖర్చులతో పరిశోధనలు పూర్తి చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లానని ఇది కేవలం ఒక్కరోజులో జరిగిన పని కాదని గత నాలుగు సంవత్సరాలుగా ప్రయత్నం విరమించకుండా కొనసాగిస్తునానని అన్నారు. వివిధ ప్రపంచంలోని దేశాలలో యుగానికి కమాండంగా 17 రాష్ట్రాలలో సేవలందించాలని చెప్పారు.అలాంటి తరుణంలో తెలంగాణ ప్రభుత్వం వెలువరించిన గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ లో భాగంగా మా గ్రామం ఎస్ సి,జనరల్ కు కేటాయించడంతో ఇప్పటికే నేను గ్రామం కోసం చేస్తున్న సేవా కార్యక్రమాలు గమనించిన గ్రామ ప్రజలు నన్ను సర్పంచ్ గా పోటీ చేయాలని కోరడంతో వారి అభ్యర్థన మేరకు సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేశానని చెప్పారు. గెలుపు గురించి తన ప్రస్తావన ఊరి ప్రజల అభిష్టమని గెలిచినా ఓడిన తన వంతుగా ఊరికి సేవ చేస్తానని యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మన ఊరి సేవలో తనకు తోడ్పాటు అందించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇట్టి కార్యక్రమంలో గోనబోయినపల్లి గ్రామ వివిధ పార్టీల నాయకులు గ్రామ పెద్దలు యువతి యువకులు మహిళలు పాల్గొన్నారు.

# ఎలిగేడు మండలంలో పంచాయతీ ఎన్నికల నామినేషన్ల హోరు



ఎలిగేడు సర్పంచ్ గా నామినేషన్ వేస్తున్న మండిగ రాజ నరసయ్య



నారాయణపల్లి లో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న రంగు. లతా శ్రీనివాస్ గౌడ్

**ఎలిగేడు, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మండలంలోని 12 గ్రామాల పరిధిలో పంచాయతీ ఎన్నికల నామినేషన్ల చివరి రోజు శుక్రవారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. సర్పంచ్ పదవికి 82, వార్డు సభ్యత్వానికి 299 నామినేషన్లు సమర్పించబడ్డాయి.ఈ సందర్భంగా ఎంపీడీవో భాస్కరరావు మాట్లాడుతూ, 17 వార్డులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలైనట్లు తెలిపారు. చివరి రోజు నామినేషన్ల హోరుతో ఎన్నికల పోటీ మరింత ఉత్కంఠభరితంగా మారిందని ఆయన పేర్కొన్నారు.



ఎలిగేడు సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న కవ్వ పెల్లి దుర్గయ్య

# వలస కూలీల పిల్లలను బడిలో చేర్పించాలి

## కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జిల్లా వ్యాప్తంగా వలస కూలీలు, కార్మికుల పిల్లలను గుర్తించి వారిని ప్రత్యేక పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మండల విద్యాధికారులు, ఇటుక బట్టీలు, పరిశ్రమల యజమానులతో సమావేశం నిర్వహించిన ఆమె, పిల్లలకు పాఠశాల వాతావరణం కల్పించేందుకు కుటుంబాలకు సమీపంగా ఉన్న పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.ఇటుక బట్టీలు, పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు పోషకాహారం, దుస్తులు, పుస్తకాలు అందిస్తామని, యజమానులు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. గత ఏడాది 500 మంది పిల్లలను ప్రత్యేక పాఠశాలల్లో చేర్పించినట్లు గుర్తుచేసి, ఈ ఏడాది మరింత శ్రద్ధతో ముందుకు సాగాలని సూచించారు. ఇప్పటికే 185 మంది పిల్లలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు.ప్రత్యేక పాఠశాలల్లో చేరిన పిల్లలకు ఇంగ్లీషులో బోధించి, భవిష్యత్తులో చదువుపై ఆసక్తి పెరిగేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ: పదవ తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి నూరు శాతం ఫలితాలు సాధించేలా చూడాలని కలెక్టర్ పమేలా సత్పతి మండల విద్యాధికారులను ఆదేశించారు. స్పెషల్ క్లాస్‌లను పర్యవేక్షిస్తూ, ఎప్పటికప్పుడు స్లిప్ టెస్టులు నిర్వహించి బోర్డు పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు.మండల విద్యాధికారులు వారానికి రెండు సార్లు సంక్షేమ వసతి గృహాలను సందర్శించాలని, పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో కనీసం 20 మంది పిల్లల నమోదు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం కోసం ఇచ్చిన గ్యాస్ కనెక్షన్లు తప్పనిసరిగా వినియోగించాలని, ప్రతి పాఠశాలలో స్నేహిత ఫిర్యాదుల పెట్టెలు ఉండాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యపై జాగృతి జిల్లా అధ్యక్షుడి స్పందన



**కరీంనగర్, డిసెంబర్ 5: (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం వల్లే సాయి ఈశ్వర చారి ఆత్మహత్య చేసుకున్నారని జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. ఆయన మాట్లాడుతూ ఈశ్వర చారి బలిదానం వృథా కాకూడదని, ప్రభుత్వం తక్షణమే బీసీలకు హక్కులు కల్పించాలన్నారు. ప్రభుత్వంలో ఉన్న బీసీ మంత్రులు రాజీనామా చేసి బయటకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. గత రెండు సంవత్సరాలుగా బీసీలపై జరుగుతున్న అరాచకాలు, అణచివేతలు ఆందోళన కలిగిస్తున్నాయని, స్వతంత్రం వచ్చినప్పటి నుండి జాతీయ పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని పేర్కొన్నారు.ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీసీలకు రిజర్వేషన్ విషయంలో ఘోరమైన మోసం జరిగిందని, అది తట్టుకోలేక సాయి ఈశ్వర చారి ప్రాణత్యాగం చేశారని అన్నారు. బీసీలు ఐక్య ఉద్యమాల ద్వారా మాత్రమే రిజర్వేషన్ సాధించగలరని, ఎవరు తమ ప్రాణాలను కోల్పోవద్దని, ధైర్యంగా నిలబడితేనే 42 శాతం రిజర్వేషన్ సాధ్యమవుతుందని హరిప్రసాద్ తెలిపారు. సాయి ఈశ్వర చారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు జాగృతి జిల్లా అధ్యక్షుడు పేర్కొన్నారు.

# ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పండ్ల పంపిణీ



**కరీంనగర్, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కొత్తపెల్లి మండలం మల్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ రాజరాజేశ్వరి, కరీంనగర్ ఆధ్వర్యంలో శుక్రవారం పండ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, సీనియర్ సభ్యులు రాళ్లబండి శంకర్ ప్రసాద్ రెడ్డి, బొంగోని పరుషరాములు, ప్రధానోపాధ్యాయురాలు పద్మాదేవి, ఉపాధ్యాయులు రోహిణి, సాయికుమార్ పాల్గొన్నారు.

# బావుపేటను బంగారు బాట పట్టిస్తాం



**కరీంనగర్, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బావుపేట గ్రామ సర్పంచ్ అభ్యర్థి దీకొండ రవీందర్‌కు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు శుక్రవారం ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఆయనకు మహిళలు, ప్రజలు మంగళహారతులు, డప్పు చప్పులతో ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా రాజేందర్ రావు మాట్లాడుతూ తన తండ్రి జగపతిరావు ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో బావుపేట అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని గుర్తుచేశారు. ప్రస్తుతం గ్రామాన్ని కొందరు అక్రమార్కులు గుప్పిట్లో పెట్టుకొని దోపిడీ వ్యవస్థను నడుపుతున్నారని విమర్శించారు. ఇకపై అవినీతి రహిత పాలన అందించేందుకు గ్రామాన్ని దత్తత తీసుకొని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.గ్రానైట్ పరిశ్రమల వనరులు ఉన్నా ప్రజలకు ఫలాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా బావుపేటను బంగారు బాట పట్టిస్తామని తెలిపారు. గ్రామస్తులు దీకొండ రవీందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యలో సంస్కరణలు అత్యవసరం





విద్య అనేది కేవలం పుస్తకాలు చదవడం, పరీక్షలు రాయడం మాత్రమే కాదు. అది మనిషిని ఆలోచించేలా, అర్థం చేసుకునేలా, సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దే ప్రవాహం. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉండగా, వారిని తీర్చిదిద్దే విద్యా వ్యవస్థ శక్తివంతం కావడం అత్యవసరం. అయితే నేటి పరిస్థితులు చూస్తే, మన విద్యార్థులు ర్యాంకుల భారంతో నలిగిపోతూ, తమ అసలైన ప్రతిభను బయటపెట్టలేకపోతున్నారు. మార్కులు ఉన్నవాడే మెదడు ఉన్నవాడన్న భావన ఇంకా చాలావరకు విద్యా వాతావరణాన్ని వేధిస్తోంది. ఈ నేపథ్యంలో నూతన విద్యా విధానంలో తీసుకొస్తున్న మార్పులు ఆశాజనకమే. చిన్నారులలో సృజనాత్మక ఆలోచనా శక్తి పెంపు, భాషా సామర్థ్యాల మీద దృష్టి పెట్టడం అభినందనీయం. అయితే ఈ మార్పులు కేవలం నిబంధనలుగా మిగలకుండా, ప్రతి పాఠశాలకు, ప్రతి విద్యార్థికి సమానంగా చేరితేనే ఫలితం కనిపిస్తుంది. పల్లెలు పట్టణాలు, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు అన్న తేడా లేకుండా ప్రతి చిన్నారి నాణ్యమైన విద్య పొందాలి. అలా కాకపోతే అసమానతల అగాథంలో మరో తరం నలగిపోతుంది. ప్రాథమిక విద్యలో బలమైన పునాదులు వేయకపోతే, ఉన్నత విద్యలో ఫలితాలు ఆశించడం వ్యర్థం. చదువులో ఆనందం కలిగే వాతావరణం, సృజనాత్మకతను వెలికితీసే బోధన, మార్గనిర్దేశనం చేసే ఉపాధ్యాయులే అసలు సంపద. విద్యార్థి ఏదైనా నేర్చుకున్న తర్వాత అది ఎలా ఉపయోగపడుతుందో, జీవనంలో ఎలా అమలు చేస్తాడో తెలిసేలా విద్య ఉండాలి. ఉన్నత విద్యలో కూడా ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా పరిశోధన, ఆవిష్కరణ, సామాజిక బాధ్యతలను ముందుకు తీసుకెళ్ళే భావజాలం పెంపొందించాలి. టెక్నాలజీ విద్యా రంగానికి తెరలేని అవకాశాలు తెచ్చినా, ఇంకా డిజిటల్ డివైడ్ బాధగా మనముందుంది. ఆన్లైన్ తరగతులు అందరికీ చేరవు. ఒక ఇంటిలో మొబైల్ కోసం పోటీ పడుతున్న పిల్లలు ఉన్నారని మరచిపోరాదు. డిజిటల్ సాధనాలు అందరికీ సులభంగా అందితేనే ఈ విప్లవం నిజమైనదవుతుంది. విద్యా సంస్కరణ అనే ఈ మహత్తర యజ్ఞంలో ప్రభుత్వం మాత్రమే కాదు, ఉపాధ్యాయులు నుంచి తల్లిదండ్రులు, సంస్థలు నుంచి సాధారణ పౌరుల వరకు అందరూ బాధ్యత వహించాలి. విద్య అనేది పాఠశాల గోడల వరకే పరిమితం కాదు. అది సమాజం మొత్తం కలిసి నడిపే యాత్ర. అవకాశాలు అందరికీ సమానంగా లభించే విద్యా వ్యవస్థను నిర్మిస్తేనే దేశం ముందుకు మరింత ధృఢంగా సాగుతుంది. ప్రతి విద్యార్థి సామర్థ్యానికి ఆకాశమే హద్దుగా మారిన రోజు ı అదే అసలైన విద్యా సంస్కరణ విజయోత్సవం.

**వ్యాసకర్త**

నిడిగొండ శ్రీరామ్
రాష్ట్ర అధ్యక్షులు
తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్



# గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్ట భద్రతా ప్రణాళిక




**కరీంనగర్, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ప్రత్యేక చర్యలు చేపట్టింది. శుక్రవారం కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆధ్వర్యంలో రూరల్, హుజురాబాద్ డివిజన్ల పోలీసు అధికారులు, క్లస్టర్ ఇంచార్జిలు, రూట్ ఇంచార్జులు, గ్రామ పోలీసులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల బందోబస్తు ప్రణాళికపై స్టేషన్ హౌస్ అధికారులకు దిశానిర్దేశం చేస్తూ, చేయవలసిన మరియు చేయకూడని పనులపై హ్యాండ్‌బుక్ అందజేశారు. కమిషనరేట్ పరిధిలోని 15 పోలీస్ స్టేషన్లను పోలింగ్ కేంద్రాలకు అనుగుణంగా విభజించి 104 రూట్లు, 57 క్లస్టర్లు ఏర్పాటు చేశారు. 83 మంది క్లస్టర్ ఇంచార్జిలు, 309 గ్రామ పోలీసులను నియమించారు.ఎన్నికల ప్రారంభం వరకు 508 మంది పోలీసులు విధులు నిర్వహించనున్నారు. పర్యవేక్షణ బాధ్యతలను ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు చేపట్టనున్నారు. రౌడీ షీటర్లపై బైండోవర్ చర్యలు పూర్తి చేసి, వారి కదలికలపై నిఘా ఉంచుతున్నట్లు సీపీ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలు, రాజకీయ పార్టీలు పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఏసీపీలు శ్రీనివాస్ జి, వేణుగోపాల్, వాసాల సతీష్, ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియపై కలెక్టర్ హైమావతి పర్యటన



**సిద్దిపేట, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
2వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి శుక్రవారం పలు మండలాల్లో పర్యటించారు. మద్దూరు మండలంలోని మద్దూరు, రేబర్తి గ్రామాలు, దుల్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి, దుల్మిట్ట, కొండాపూర్ గ్రామాలు, అక్కన్నపేట మండలంలోని రామవరం గ్రామపంచాయతీల్లో నామినేషన్ స్వీకరణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మద్దూరు, రేబర్తి, బైరాన్‌పల్లి, దుల్మిట్ట, కొండాపూర్, రామవరం క్లస్టర్లలో అధికారులు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్‌కు వివరించారు.కలెక్టర్ మాట్లాడుతూ, స్టేట్ ఎలక్షన్ కమిషన్ నియమావళి ప్రకారం జిల్లాలో మూడవ విడత నామినేషన్ ప్రక్రియ ఈ రోజు ముగుస్తుందని, చివరి రోజు కావడంతో అభ్యర్థుల తాకిడి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే టోకెన్ ప్రకారం అభ్యర్థులను అనుమతించాలని, ఆ తర్వాత ఎవ్వరినీ అనుమతించరాదని పంచాయతీ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేశారు.అభ్యర్థుల నామినేషన్ల కోసం రెండు లేదా మూడు కౌంటర్లు ఏర్పాటు చేయాలని, నామినీతో పాటు ఇద్దరిని మాత్రమే లోపలికి అనుమతించాలని సూచించారు. క్లస్టర్ పరిధిలో 100 మీటర్లలో వాహనాల పార్కింగ్ లేకుండా 144 సెక్షన్ కింద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులకు ఆదేశించారు.నామినీ అభ్యర్థులు ర్యాలీలతో ఎక్కువ మందితో వస్తే, అది మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన కింద పరిగణించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆఫ్ పోలీస్‌కు ఫోన్ ద్వారా ఆదేశించారు.

# దత్తాత్రేయ స్వామిని దర్శించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బోయినపల్లి మండలం వరదవల్లిలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పలువురు నేతలు ప్రత్యేక పూజలు చేశారు. మిడ్ మానేరు ప్రాజెక్ట్ కారణంగా ఆలయం చుట్టూ నీరు చేరడంతో, స్పీడ్ బోట్‌లో ప్రయాణించి ఆలయానికి చేరుకున్నారు.దత్తాత్రేయ స్వామి జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించిన మంత్రి, జయంతి రోజున భక్తుల సౌకర్యార్థం బోట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శాశ్వతంగా బోట్ సౌకర్యం కల్పించేందుకు ఇరిగేషన్ శాఖ వద్ద ఫైల్ పెండింగ్‌లో ఉందని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు దత్తాత్రేయ స్వామి ఆశీర్వచనం కావాలని కోరారు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి గ్రామాల్లో కూడా ప్రతిఫలించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు.

# గుజ్జులపల్లిలో ప్రపంచ నేల దినోత్సవ వేడుకలు



**హుస్నాబాద్, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం గుజ్జులపల్లె గ్రామంలో ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా రైతులకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఇండియా, ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రామారావు మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సేంద్రియ ఎరువులు, పచ్చి రొట్టె ఎరువులు, మిక్స్డ్ క్రాప్స్, వర్మీ కంపోస్ట్, పశువుల గొర్ల మందలు వాడితే నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని, నీటిని నిలుపుకునే శక్తి పెరుగుతుందని తెలిపారు. ప్రతి మూడు పంటలకు ఒకసారి లేదా కనీసం రెండు సంవత్సరాలకు ఒకసారి భూసార పరీక్షలు చేసి, వచ్చిన ఫలితాల ఆధారంగా సూచించిన మోతాదులోనే ఎరువులు వాడాలని రైతులకు సూచించారు.నేల కోతను అరికట్టేందుకు అడ్డంగా దున్నుకోవడం, గట్ల వెంబడి మొక్కలు నాటడం అవసరమని చెప్పారు. విషపూరిత రసాయన ఎరువులు, పురుగుమందులను తగ్గించి సాంప్రదాయ జీవన ఎరువులను వాడి జీవవైవిధ్యాన్ని పెంపొందించాలని, పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు.రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన నేలను అందించేందుకు రైతులు సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామారావు, మమత, రజిత, సోనీ, తిరుపతి, రాజులు, స్కూల్ హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# అచ్చంపేట, అమ్రాబాద్ ప్రాంతాల్లో నామినేషన్ కార్యక్రమాలు







**అచ్చంపేట డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలో పుల్జాల గ్రామపంచాయతీ టిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా పొలమూరు సాయిబాబా నామినేషన్ దాఖలు చేశారు. అభ్యర్థిని పొలమూరు లక్ష్మయ్య బలపరిచారు. రిటర్నింగ్ అధికారికి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు. అచ్చంపేట మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు నరముని నరేష్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన అనంతరం తిరిగి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. కొమ్ము బుచ్చిరాములు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.అమ్రాబాద్ మేజర్ గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా చిగుర్ల కోటయ్య నామినేషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదేశాల మేరకు నామినేషన్ వేయడం జరిగిందని, భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.4.50కోట్ల అవినీతి ఆరోపణలు

**కరీంనగర్, డిసెంబర్ 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన రూ. 4.50 కోట్ల అవినీతి, అక్రమాలపై ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడంపై ఏఐఎఫ్బి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్లకు బహిరంగ లేఖ పంపారు. ట్విట్టర్, వాట్సాప్, పోస్టు ద్వారా లేఖలు పంపినట్లు తెలిపారు. ఆసుపత్రిలో జరిగిన భారీ కుంభకోణంపై మంత్రులు స్పందించకపోవడం శోచనీయమని, ప్రజలకు సేవలు




అందించే ఆసుపత్రిలో అవినీతి జరగడం అసహ్యకరమని అన్నారు.డాక్టర్లు కృష్ణ ప్రసాద్, అజయ్ ప్రసాద్, నవీన, మొహమ్మద్ అలీమ్, రత్నమాల, శ్రీనివాస్, జ్యోతి గార్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, సస్పెండ్ చేసి ఉద్యోగాల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాలని కూడా కోరారు.రాష్ట్ర వైద్య విధాన పరిషత్ అధికారులు, జిల్లా డీఎంహెచ్వో, ఇతర అధికారులు ఇప్పటికే ఎంక్వైరీ చేసి 20 రోజులు గడిచినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రశ్నార్థకమని శేఖర్ అన్నారు. రెండవసారి చేసిన ఎంక్వైరీ రిపోర్టును బహిర్గతం చేయాలని, అవినీతి అధికారులను కాపాడే ప్రయత్నాలు ఆపాలని ఆయన డిమాండ్ చేశారు.